# మనజనప్రగతి

జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక

సంపుటి : 6 సంచిక : 217 పేజీలు : 8 వెల : రూ.2/- మంగళవారం 01 సెప్టెంబర్ 2026 వైయస్ఆర్ కడప

Kadapa, Ananthapur, Chittor, Vishakapatanam, Srikakulam, Elluru, Thirupathi, Ongole, Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool


# భగీరథ ప్రయత్నంతో కరవు సీమకు కృష్ణమ్మ

**- 30 ఏళ్ల కల సాకారం..వెలిగొండ ప్రాజెక్టు తొలిదశ ప్రారంభించిన సీఎం**

- నల్లమల కొండల్ని చీల్చుకుని నల్లమల సాగర్‌కు కృష్ణమ్మ పరుగు
- తొలిదశతో 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు..4 లక్షల మందికి తాగునీరు
- జలహారతి అనంతరం కృష్ణా జలాలకు సీఎం సాష్టాంగ నమస్కారం
- 2028లో రెండోదశ పూర్తి...మార్కాపురంలోనూ కృష్ణా పుష్కరాలు
- మార్కాపురం దోర్నాల వద్ద బహిరంగ సభలో సీఎం చంద్రబాబు ప్రసంగం








**మార్కాపురం,మన జనప్రగతి ఆగస్టు 31:** మూడు దశాబ్దాలుగా ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల ప్రజలు ఎదురుచూస్తున్న వెలిగొండ ప్రాజెక్టు కల సాకారమైంది. పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జాతికి అంకితం చేశారు. దోర్నాల మండలం గంటవానిపల్లె వద్ద నల్లమల కొండల్లోని జంట సొరంగాల నుంచి వెలువడిన కృష్ణా జలాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, జల హారతి ఇచ్చి స్వాగతించారు. అనంతరం ప్రాజెక్టు తొలిదశ ప్రారంభోత్సవానికి సూచికగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కరవునేలను తాకిన కృష్ణా జలాలకు ముఖ్యమంత్రి సాష్టాంగ నమస్కారం చేశారు. శ్రీశైలం జలాశయంలోని కొల్లం వాగు నుంచి గ్రావిటీ ద్వారా తరలించిన కృష్ణా జలాలు వెలిగొండ జంట సొరంగాల మీదుగా గంటవానిపల్లె అక్విడెక్టుకు చేరుకుని నల్లమల సాగర్ వైపు పరుగులు తీశాయి. నల్లమల కొండలను చీల్చుకుని కాలువల్లో ప్రవహించిన కృష్ణమ్మకు స్థానిక మహిళలు, ప్రజలు పుష్పాలతో ఘన స్వాగతం పలికారు.ప్రత్యేక పూజల అనంతరం పవిత్ర జలాలను సీఎం చంద్రబాబు మంత్రులు మిగతా2లో...



# కిర్గిస్థాన్‌లో ఇరాన్ అధ్యక్షుడితో మోడీ భేటీ

**న్యూఢిల్లీ,మన జనప్రగతి ఆగస్టు 31:** ప్రధాని మోదీ సోమవారం ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్‌తో భేటీ అయ్యారు. కిర్గిస్తాన్‌లో జరుగుతున్న షాంఘై కో-ఆపరేషన్ ఆర్గనైజేషన్ సమావేశంలో ఆ ఇద్దరు కలుసుకున్నారు. కిర్గిస్తాన్ రాజధాని బిష్కెక్‌లో ఆ మీటింగ్ జరిగింది. ఫిబ్రవరిలో ప్రారంభమైన ఇరాన్ వార్ తర్వాత తొలిసారి ఈ ఇద్దరు నేతలు కలుసుకున్నారు. ఇరాన్‌కు వ్యతిరేకంగా అమెరికా, ఇజ్రాయెల్ దళాలు అటాక్ చేసిన విషయం తెలిసిందే. ఇదే సమావేశాల్లో ఆర్మేనియా ప్రధాని నికోల్ మిగతా2లో...

# పరిశ్రమలన్నీ 33 శాతం పచ్చదనాన్ని పాటించాలి

రేపటి తరాలకు పచ్చని భవిష్యత్తును అందించేందుకు సహకరించాలి

పారిశ్రామిక వర్గాలకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పిలుపు




# కేసీఆర్ తన పదవికి రాజీనామా చేయాలి

- వేయి రోజుల్లో కెసిఆర్‌కు కోటి 24 లక్షల 40 వేల జీతభత్యాలు
- ఆందోళనలకు పిలుపునిచ్చిన రేవంత్ రెడ్డి




# విశాఖలో ఎఐజి ఆస్పత్రి నిర్మాణం

2వేల కోట్ల పెట్టుబడితో 9వేల మందికి ఉపాధి

శంకుస్థాపన చేసిన మంత్రి లోకేశ్

ఆలిండియా రేడియో సెంటర్‌లో రోశయ్య విగ్రహావిష్కరణ




**విశాఖపట్నం,మన జనప్రగతి ఆగస్టు 31:** ఆసియాలోనే ప్రసిద్ధి చెందిన ఏఐజీ ఆసుపత్రి రాష్ట్ర ప్రజలకు అందుబాటులోకి రానుంది. ఈ మేరకు విశాఖ 8వ వార్డులోని ఎండాడ వద్ద ఏఐజీ హాస్పిటల్స్ నిర్మాణానికి సంస్థ ఛైర్మన్ డాక్టర్ డి.నాగేశ్వర్ రెడ్డితో కలిసి విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ భూమిపూజ చేశారు. ఎండాడ వద్ద వేదిక ప్రాంగణానికి చేరుకున్న మంత్రి లోకేశ్‌కు ఏఐజీ హాస్పిటల్స్ ప్రతినిధులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆసుపత్రి నిర్మాణ పనులకు మంత్రి శిలాఫలకాన్ని ఆవిష్కరించి శంకుస్థాపన చేశారు. మిగతా2లో...



## బాణాసంచా కర్మాగారంలో భారీ పేలుడు

- పేలుడు ధాటికి 11 మంది దుర్మరణం
- యూపి సిఎం యోగి ఆదిత్యనాథ్ తీవ్ర దిగ్భ్రాంతి

**లక్నో,మన జనప్రగతి ఆగస్టు 31:** ఉత్తర్‌ప్రదేశ్‌లోని కౌశాంబి జిల్లాలో సోమవారం మధ్యాహ్నం ఘోర మిగతా2లో...

# ఎపి మద్యం కేసులో సిట్ తీరు

**- అసహనం వ్యక్తం చేసిన సుప్రీంకోర్టు**



**న్యూఢిల్లీ,మన జనప్రగతి ఆగస్టు 31:** ఏపీలో మద్యం అక్రమ రవాణా కేసులో సిట్ తీరుపై సుప్రీంకోర్టు అసహనం వ్యక్తం చేసింది. రెండేళ్లుగా కేసు నడుస్తోందని, ఇంతవరకు ఏం కనుగొనలేదని పేర్కొంది. ముందుగా సిట్ తీరును ఎగ్జామిన్ చేసి.. ఆ తర్వాత హైకోర్టు తీర్పును పరిశీలిస్తామని తెలిపింది. రాజ్ కెసిరెడ్డి కేసులో హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ సిట్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా సర్వోన్నత మిగతా2లో...




## వెలిగొండతో కరువు ప్రాంత రైతులకు కొత్త వెలుగు

సాగు,తాగునీరు, ప్రాంతీయ అభివృద్ధికి కొత్త అధ్యాయం

వ్యవసాయ శాఖ మంత్రి అచ్చన్నాయుడు

# జగన్ రాకతో వెలిగొండకు గ్రహణం

**కూటమి వచ్చాకే పనులు పూర్తి: జలవనరుల మంత్రి నిమ్మల విమర్శలు**



**మార్కాపురం,మన జనప్రగతి ఆగస్టు 31:**వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవ సభలో గొడ్డలి పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ నిర్వాకాలను మంత్రి నిమ్మల రామానాయుడు కడిగిపారేశారు. వెలిగొండ పేరుతో జగన్ చేసిన మోసాన్ని సభలో ఆసాంతం వివరించారు. 2019-2024 మధ్య కాలంలో వెలిగొండ పేరుతో చేసిన దుర్మార్గాలను ఎండగట్టారు. టన్నెల్-2లో టన్నెల్ బోరింగ్ మిషన్ తీయడానికి కనీస ప్రయత్నం చేయకుండానే.. రూ.2 వేల కోట్లకు పైగా పనులు పెండింగ్‌లో ఉండగానే జాతికి అంకితమంటూ ఆనాడు జగన్ మిగతా2లో...

# భగీరథ ప్రయత్నంతో కరవు సీమకు కృష్ణమ్మ

(మొదటి పేజీ తరువాయి)

అధికారులు, ప్రజా ప్రతినిధులపై స్వయంగా చల్లారు. అక్విడెక్టు వద్ద రైతులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి స్విచ్ నొక్కి జలాలను దిగువకు వదిలారు. **30 ఏళ్ల క్రితం భూమిపూజ.. నేడు ప్రారంభం** వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవం తన జీవితంలో భావోద్వేగ సందర్భమని చంద్రబాబు పేర్కొన్నారు. 1996 మార్చి 5న ముఖ్యమంత్రిగా తానే ఈ ప్రాజెక్టుకు భూమిపూజ చేశానని, సరిగ్గా 30 ఏళ్ల తర్వాత 2026 ఆగస్టు 31న ప్రాజెక్టు మొదటి దశను ప్రారంభిస్తున్నానని చెప్పారు. సీఎం మాట్లాడుతూ.. "ఆ రోజు చేసిన సంకల్పం.. ఈ రోజు నల్లమల సాగర్‌లో జలసిరిగా మారింది. ఇది భగీరథ ప్రయత్నం. కొండలు అడ్డు వచ్చినా తొలిచి ముందుకు వెళ్లాం. కరువు నేలకు కృష్ణమ్మను తీసుకొచ్చాం. శ్రీశైలం మల్లన్న సన్నిధి నుంచి బయలుదేరిన కృష్ణమ్మ.. మార్కాపురం చెన్న కేశవుడు కొలువైన నేలకు జలహారతి ఇస్తోంది. ప్రజలు ఇచ్చిన తీర్పుతోనే వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించుకుని జల సిరులతో ఈ ప్రాంత అభివృద్ధికి రెక్కలు తొడిగాం. వెలిగొండ బంగారు కొండ అవుతుంది. ఈ ప్రాంత ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతుంది. మాట ఇచ్చాం.. ప్రాజెక్టు పూర్తి చేసి కృష్ణమ్మను తరలించాం. ఇక సంపద సృష్టిస్తాం. మార్కాపురం గడ్డకు, కరువుతో పోరాడిన రైతన్నలకు, ఫ్లోరైడ్ బాధలు భరించిన కుటుంబాలకు, నీటి కోసం ఎదురు చూసి అలసిపోయిన తరాలకు కృష్ణా జలాలతో కొత్త ఊపిరి ఇస్తున్నాం."అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. **నిర్వాసితుల త్యాగాలకు పాదాభివందనం** వెలిగొండ ప్రాజెక్టు కోసం భూములు, ఇళ్లు, గ్రామాలను త్యాగం చేసిన 11 గ్రామాల ప్రజలకు పాదాభివందనం చేస్తున్నానని సీఎం అన్నారు. రైతుల త్యాగం లక్షల మంది జీవితాల్లో వెలుగులు నింపుతోందన్నారు. "ప్రాజెక్టు వల్ల లబ్ధి పొందేవారు ఎంత సంతోషంగా ఉంటారో.. నిర్వాసితులు కూడా అంతే సంతోషంగా ఉండాలి. కేవలం 48 రోజుల్లో 6,206 నిర్వాసిత కుటుంబాలకు రూ.768 కోట్ల పరిహారం అందించాం. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ నిర్వాసితుల బాధలు, అవసరాలను గుర్తించి అదనంగా మరో రూ.169 కోట్లు చెల్లిస్తున్నాం. కటాఫ్ తేదీని పెంచి 18 ఏళ్లు నిండిన యువతకు ఒక్కొక్కరికి రూ.2 లక్షల చొప్పున అందించాం. రూ.10,200 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన వెలిగొండ ప్రాజెక్టులో ఇప్పటివరకు రూ.7,983 కోట్లు ఖర్చు చేసి మొదటి దశను పూర్తి చేశాం. 18.8 కిలోమీటర్ల మేర జంట సొరంగాలు, 21.8 కిలోమీటర్ల ఫీడర్ కాలువల పనులు పూర్తి అయ్యాయి. తొలిదశలో భాగంగా నల్లమల సాగర్‌కు 10.70 టీఎంసీల నీటిని తరలిస్తాం. 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు, 4 లక్షల మందికి తాగునీరు అందుతుంది. వెలిగొండ పూర్తయితే ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లోని 30 మండలాల్లో 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు, 23 లక్షల మందికి తాగునీరు అందుతుంది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 3.36 లక్షల ఎకరాలు, నెల్లూరు జిల్లాలో 84 వేల ఎకరాలు, కడప జిల్లాలో 27 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. తీగలేరు కాలువ కింద 62 వేల ఎకరాలు, గొట్టిపడియ కాలువ కింద 9,500 ఎకరాలు, తూర్పు ప్రధాన కాల్వ కింద 3.70 లక్షల ఎకరాల ఆయకట్టు సుస్థిరం అవుతుంది. కృష్ణమ్మ రాకతో పశ్చిమ ప్రకాశంలో ఫ్లోరైడ్ అనే పదం గత చరిత్రగా మిగిలిపోతుంది. వెలిగొండ అంటే ఫ్లోరైడ్ కష్టాలకు ముగింపు. కరువు నేలపై కృష్ణమ్మ రాసిన కొత్త చరిత్ర." అని ముఖ్యమంత్రి అభివర్ణించారు. **వెలిగొండకు 2019లో గ్రహణం.. 2024లో విముక్తి"** 2019లో గొడ్డలి పార్టీ అధికారంలోకి రావడంతో వెలిగొండ ప్రాజెక్టుకు గ్రహణం పట్టింది. విలువైన నిర్మాణ కాలాన్ని వృథా చేశారు. నిర్వాసితుల కోసం జీవో ఇచ్చి అరకొరగా చెల్లింపులు చేశారు. ఎన్నికలకు నెల రోజుల ముందు ప్రాజెక్టును పూర్తి చేశామని చెప్పడం, రూ.4 వేల కోట్ల పనులు పెండింగ్‌లో ఉండగానే జాతికి అంకితం చేశామని ప్రకటించడం ప్రజలను మోసం చేయడమే. ఫేక్ డ్రామాలు, సినిమా సెట్టింగులతో ప్రజల్ని, రైతుల్ని మోసం చేసిన వ్యక్తుల్ని ఏం చేయాలి. పనులు చేసేశామని చెప్పి బుకాయించటం తప్పు. ఫేక్ మాటలు చెప్పే వ్యక్తుల్ని, మోసం చేసిన వారి గురించి ఈ ప్రాంత ప్రజలు నిలదీయాలి. గొడ్డలి పార్టీ హయాంలో సొరంగాల్లో టీబీఎం యంత్రం ఇరుక్కు పోవడంతో పనులు పూర్తికాలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే సమస్యలను పరిష్కరించి పనులు పూర్తి చేసి ఇప్పుడు కృష్ణా జలాలను అందించింది. చరిత్రను ఎవరూ తిరగ రాయలేరు. ఫేక్ ప్రచారాన్ని సమర్థంగా తిప్పికొడతాం. చెడును ఖండించాలి. మంచి చేసిన ప్రభుత్వానికి అండగా ఉండాలి."అని సీఎం వ్యాఖ్యానించారు.మార్కాపురంలోనూ 2028 కృష్ణా పుష్కరాలువెలిగొండ ప్రాజెక్టు మొత్తం పూర్తికావడానికి మరో రూ.1,900 కోట్ల పనులు చేయాల్సి ఉందని చంద్రబాబు తెలిపారు. వెలిగొండ ఫేజ్-2ను కూడా 2028 నాటికి పూర్తి చేసే బాధ్యతను కూటమి ప్రభుత్వం తీసుకుంటుందని ప్రకటించారు. మార్కాపురం జిల్లాను ఏర్పాటు చేశామని, రాయలసీమ హార్టీ కల్చర్ హబ్‌లో మార్కాపురాన్ని భాగం చేశామని చెప్పారు. రాష్ట్రంలోని ప్రతి ప్రాంతాన్ని సమానంగా అభివృద్ధి చేయడమే ఎన్డీఏ విధానమని, రాయలసీమ, ఉత్తరాంధ్ర, కోస్తా ప్రాంతాల్లో సమగ్ర అభివృద్ధి సాధిస్తామని స్పష్టం చేశారు. దేశం ఎదుర్కొంటున్న నీటి సమస్యలకు నదుల అనుసంధానమే పరిష్కారమని చంద్రబాబు అన్నారు. పోలవరం రాష్ట్రానికి జీవనాడి అని, 2027 మార్చి నాటికి పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని చెప్పారు. పోలవరం ఎడమ కాలువ ద్వారా గోదావరి జలాలను అనకాపల్లికి తరలిస్తున్నామని, తదుపరి వంశధార వరకూ తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. దక్షిణ భారతదేశంలో గోదావరి-కావేరి అనుసంధానం జరగాలని, మహానది- గంగానదులను అనుసంధానిస్తే దేశం సుభిక్షంగా మారుతుందని ఆకాంక్షించారు. వచ్చే మూడేళ్లలో 36 ప్రాజెక్టులను పూర్తి చేసేలా ఇరిగేషన్ క్యాలెండర్ రూపొందించామని చెప్పారు. ప్రతి వర్షపు నీటి చుక్కను పొదుపు చేసి భూగర్భజలంగా మార్చు కోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. 2028లో జరిగే కృష్ణా పుష్కరాలను మార్కాపురంలోనూ వైభవంగా నిర్వ హించుకుందామని చంద్రబాబు అన్నారు. గోదావరి జలాలు నల్లమల సాగర్ వరకూ రావాలని, అందు కోసం ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తోందని తెలిపా రు. ఓట్లు ఆశించి కాదు.. మార్పు ఆశించి పనిచేస్తు న్నామని.. ఎన్నికల కోసం కాదు.. ప్రజల జీవితాలను మార్చేందుకు, భవిష్యత్ తరాల అభివృద్ధి కోసం పనిచేస్తున్నామని సీఎం స్పష్టం చేశారు.

# పరిశ్రమలన్నీ 33 శాతం పచ్చదనాన్ని పాటించాలి

**మంగళగిరి,మన జనప్రగతి ఆగస్టు 31:** రాష్ట్ర ఆర్థిక పురోగతికి పారిశ్రామిక అభివృద్ధి ఎంత ముఖ్యమో, పర్యావరణ పరిరక్షణ కూడా అంతే ముఖ్యమైనదని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు, అటవీ, పర్యావరణ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని పరిశ్రమలు పర్యావరణ నిబంధనలను తు.చ. తప్పక పాటించాలని స్పష్టం చేశారు. కాలుష్య నియంత్రణ మండలి మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతి పరిశ్రమ తన ప్రాంగణంలో కనీసం 33 శాతం పచ్చదనాన్ని అభివృద్ధి చేసి, సంరక్షించే బాధ్యతను చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రతి పారిశ్రామికవేత్త దీనిని ఒక సామాజిక బాధ్యతగా స్వీకరించి ముందుకు తీసుకెళ్లాలని కోరారు. ఈ మేరకు ఉపముఖ్యమంత్రి కార్యాలయం నుండి ప్రకటన విడుదలయ్యింది. పరిశ్రమల పరిసరాల్లో మొక్కలు నాటడం ద్వారా వాయు కాలుష్యాన్ని నియంత్రించడంతో పాటు వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించవచ్చని పవన్ కళ్యాణ్ తెలిపారు. భావితరాలకు ఆరోగ్యకరమైన, స్వచ్ఛమైన, పచ్చని భవిష్యత్తును అందించడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. పరిశ్రమలు తమ సామాజిక బాధ్యతలో భాగంగా పచ్చదనాన్ని పెంపొందించే కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టి, పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు ముందుకు రావాలని సూచించారు.అభివృద్ధి, ప్రకృతి పరిరక్షణలను సమాంతరంగా ముందుకు తీసుకువెళ్లినప్పుడే స్థిరమైన ప్రగతి సాధ్యమవుతుందని ఉప ముఖ్యమంత్రి అన్నారు. పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారా సమాజానికి, ప్రకృతికి, రాబోయే తరాలకు విలువైన భవిష్యత్తును అందించగలమని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని రకాల పరిశ్రమలు 33 శాతం పచ్చదనం నిబంధనను కచ్చితంగా అమలు చేసేలా కాలుష్య నియంత్రణ మండలి, ఏపీ-గ్రీన్ సంస్థలు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. 2026 గణాంకాల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా పోర్టులు, సిమెంట్, మైనింగ్, ఎనర్జీ, ఆహార శుద్ధి, ప్లాస్టిక్, పేపర్, వస్త్రాలు తదితర రంగాలకు చెందిన సుమారు 3,400 పరిశ్రమలు, కంపెనీలు వేలాది ఎకరాల విస్తీర్ణంలో తమ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. ఇప్పటికే కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో 14 రోజుల ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, తొలి విడతగా పైలట్ ప్రాజెక్టు కింద రాష్ట్రవ్యాప్తంగా 26 పరిశ్రమల్లో 129 ఎకరాల విస్తీర్ణంలో పచ్చదనం పెంపొందించే కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి సహకరించిన పరిశ్రమల యాజమాన్యాలను పవన్ కళ్యాణ్ అభినందించారు. ఇదే స్ఫూర్తితో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని పరిశ్రమలు 33 శాతం పచ్చదనం లక్ష్య సాధనలో భాగస్వాములు కావాలని కోరారు.

## కేసీఆర్ తన పదవికి రాజీనామా చేయాలి

**హైదరాబాద్,మన జనప్రగతి ఆగస్టు 31:** కేసీఆర్ 1000 రోజుల్లో కోటి 24 లక్షల 40 వేల రూపాయలు జీతం తీసుకున్నా రు. ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగి 365 రోజులు ఉద్యోగానికి హాజరు కాకపోతే డిస్మిస్ చేస్తారు. మరి కేసీఆర్‌ను ఏం చేయాలి. ప్రతిపక్ష నాయకుడి హోదా ఉన్నందుకు ఆయనకు ఇన్నిరోజులు సెక్యూరిటీ, ఇల్లు, బులెట్ ప్రూఫ్ వాహనాలు తదితర వసతుల కోసం ప్రభుత్వం రూ.21 కోట్లు ఖర్చు చేసింది. కేసీఆర్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలి. ఆయన రాజీనామా కోరుతూ ప్రజలు ఊరూరా ఆందోళనలు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. అంబర్‌పేట సభలో సిఎం మాట్లాడుతూ కేసీఆర్‌కు.. నాకు పోలిక ఏంటి..? కేసీఆర్ సీఎం అయితే ఆయన కుటుంబ సభ్యులు, బంధువులకు పదవులు కట్టబెట్టారు. నేను సీఎం అయ్యాక ఎస్సీ, ఎస్టీ, బీసీలకు పదవులు ఇచ్చాం. దేశంలోనే ప్రధాన ప్రతిపక్ష నేత వైఫల్యం చెందిన ఏకైక రాష్ట్రం తెలంగాణ. పదేళ్లలో మీరు ఏం చేశారో.. రెండున్నరేళ్లలో.. మేం ఏం చేశామో అసెంబ్లీలో చర్చకు సిద్ధం. ఈ వెయ్యి రోజుల్లో జనం కోసం కేసీఆర్ ఒక్కసారైనా బయటకు వచ్చారా? ఈ వెయ్యి రోజుల్లో ప్రధాన ప్రతిపక్ష నేత రూ.22.24 కోట్ల ప్రభుత్వ వేతనం తీసుకున్నారు. రేపటి నుంచి 6 రోజులపాటు ప్రధాన ప్రతిపక్ష నేత రాజీనామా చేయాలంటూ ఆందోళనలు చేయాలి.' అని ప్రతిపక్ష నేతపై సీఎం రేవంత్ ఘాటైన విమర్శలు చేశారు. ఉస్మానియా ఆసుపత్రిని 2 వేల పడకలతో కడుతున్నాం. వచ్చే ఏడాదిలో ప్రారంభిస్తాం. సనత్‌నగర్ టిమ్స్‌కు మర్రిచెన్నారెడ్డి పేరు, అల్వాల్‌లో ఉన్న టిమ్స్‌కు టి.అంజయ్య పేరు, ఎల్బీనగర్ టిమ్స్‌కు కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు, వరంగల్‌లో ఉన్న టిమ్స్‌కు ప్రొ.జయశంకర్ పేరు పెడతాం. బ్రిటిష్ హయాంలో 1931లో కులగణన చేస్తే.. 100 ఏళ్లలో మళ్లీ కులగణన చేసేందుకు ఈ దేశంలో ఏ నాయకుడు ధైర్యం చేయలేదు. జనగణన, కులగణన చేస్తారా లేదా గద్దె దిగుతారా అని తెలంగాణ సమాజం ప్రధాని మోదీకి సవాల్ విసిరిందన్నారు.

## జగన్ రాకతో వెలిగొండకు గ్రహణం

(మొదటి పేజీ తరువాయి)

డ్రామాలాడారంటూ విరుచుకుపడ్డారు. చంద్రబాబు హయాంలో ప్రాజెక్టు నిర్మాణానికి తీసుకున్న చర్యలు.. నిర్వాసితుల విషయంలో చంద్రబాబు పెద్ద మనస్సుతో వ్యవహరించారంటూ గత రెండేళ్ల కాలంలో జరిగిన పరిణామాలను మంత్రి వివరించారు. నాడు జగన్ ఇంకా పూర్తిగా తవ్వని సొరంగంలో కార్పెట్ వేసుకుని నడిచి నకిలీ జాతికి అంకితం కార్యక్రమాన్ని చేపట్టారని మండిపడ్డారు. టన్నెళ్లల్లోకి కృష్ణా జలాలను పంపి నిజమైన జాతికి అంకితం కార్యక్రమాన్ని సీఎం చంద్రబాబు చేపట్టారని మంత్రి నిమ్మల రామానాయుడు వివరించారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి 2019లో అధికారంలోకి రావడంతో వెలిగొండ ప్రాజెక్ట్‌కు గ్రహణం పట్టిందని మంత్రి విమర్శించారు. 2024లో కూటమి రాకతో గ్రహణం వీడిందని తెలిపారు. మార్కాపురం జిల్లాలో వెలిగొండ ప్రాజెక్ట్‌కు సీఎం చంద్రబాబు శంకుస్థాపన అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో మంత్రి ప్రసంగించారు. గొడ్డలి పార్టీ హయాంలో విలువైన ఈ ప్రాజెక్ట్ నిర్మాణ కాలాన్ని గాలికొదిలేశారని ధ్వజమెత్తారు. నిర్వాసితుల కోసం జీవో ఇచ్చి అరకొర చెల్లింపులతో మోసం చేశారని ఆగ్రహించారు. ఏపీ సార్వత్రిక ఎన్నికల కంటే ఒక్క నెల ముందు ఈ ప్రాజెక్ట్‌ను పూర్తి చేసి జాతికి అంకితం చేస్తున్నట్లుగా జగన్ డ్రామాలు ఆడారని మండిపడ్డారు.

## కర్నాటకలో రైలు ఢీకొని ముగ్గురు మృతి

**- హిందూపురం వాసులుగా గుర్తింపు**

**బెంగళూరు,మన జనప్రగతి ఆగస్టు 31:** బెంగళూరు రూరల్ జిల్లా దొడ్డబల్లాపుర రైల్వే స్టేషన్‌లో ట్రాక్ దాటుతున్న ఓ మహిళ సహా ఇద్దరు బాలికలను రైలు ఢీకొంది. ఈ ప్రమాదంలో వారు అక్కడికక్కడే మృతి చెందారు.

సమాచారం అందుకున్న యలహంక రైల్వే పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతులు ఏపీ రాష్ట్రం హిందూపురానికి చెందిన ఇర్ఫాన (46), రుకియా (13), రాకియా(8)గా గుర్తించారు. ఆదివారం సెలవు కావడంతో దొడ్డబళ్లపురలోని బంధువుల ఇంటికి వీరు వచ్చారు. సోమవారం ఇంటికి వెళ్లే క్రమంలో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## కిర్గిస్థాన్‌లో ఇరాన్ అధ్యక్షుడితో మోడీ భేటీ

(మొదటి పేజీ తరువాయి)

పషిన్యాన్‌తోనూ ప్రధాని మోదీ భేటీ అయ్యారు. పెజెష్కియాన్, మోదీ మధ్య ఎటువంటి సంభాషణ జరిగిందో ఇంకా స్పష్టంగా తెలియదు. కానీ హోర్ముజ్ జలసంధి అంశంలో చర్చ జరిగి ఉంటుందని నిపుణులు భావిస్తున్నారు. పెజెష్కియాన్, మోదీ మధ్య జరిగిన భేటీ గురించి భారత్‌లో ఇరాన్ ఎంబసీ తన సోషల్ మీడియాలో పోస్టు చేసింది. అయితే అమెరికాకు వ్యతిరేకంగా శక్తులను ఏకీకరించేందుకు పెజెష్కియాన్ ఎస్‌సీవో మీటింగ్‌లో పాల్గొంటున్నారు.

## విశాఖలో ఏఐజి ఆస్పత్రి నిర్మాణం

(మొదటి పేజీ తరువాయి)

ఆసుపత్రికి సంబంధించి రూపొందించిన ఏవీని వీక్షించారు. విశాఖలో నెలకొల్పనున్న ఏఐజీ ఆసుపత్రి ద్వారా సంస్థ దశలవారీగా ఐదేళ్లలో రూ.2 వేల కోట్ల పెట్టుబడి పెట్టనుంది.
తద్వారా 9వేల మందికి ఉద్యోగాలు రానున్నాయి. పూర్తిస్థాయి నిర్మాణం పూర్తయ్యే నాటికి ఆసుపత్రి సామ ర్థ్యం వెయ్యి పడకలకు చేరనుంది. విశాఖలో 9 ఎకరాల్లో ఆసుపత్రి క్యాంపస్, 2.5 ఎకరాల్లో నర్సిం గ్ కళాశాలను ఏర్పాటు చేయనుంది. అంతకుముందు మాజీ సిఎం రోశయ్య విగ్రహాన్ని లోకేశ్ ఆవిష్కరించారు. దివంగత మాజీ గవర్నర్, మాజీ సీఎం కొణిజేటి రోశయ్య స్ఫూర్తితో యువత రాజ కీయాల్లోకి రావాలని మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు.
విశాఖపట్నంలోని ఆలిండియా రేడి యో జంక్షన్‌లో రోశయ్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. టీడీపీ ఏపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రి టీజీ భరత్, ఎంపీ భరత్, ఎమ్మెల్యేలు వంశీ, విష్ణు కుమార్ రాజు, రోశయ్య కుటుంబ సభ్య లు పాల్గొన్నారు. రోశయ్యను స్టాట్యూ ఆఫ్ స్టేట్స్ మాన్‌గా నామకరణం చేయాలని మంత్రి లోకేశ్ సూచించారు. తమలాంటి యువతకు రోశయ్య ఆదర్శమని పేర్కొన్నారు. రోశయ్య లాంటి రాజకీ యాలకు తమ తరం దూరమైందని బాధపడుతున్నానని తెలిపారు. తమ తరం రాజకీయాల్లో మా ర్పు రావాలని చెప్పారు. ఆయన అన్ని పదవుల్లో పనిచేశారని.. తెలుగు జాతి కోసం ఆలోచించారని కొనియాడారు. రోశయ్య గురించి పుస్తకాలు రాయాలని, కుటుంబ సభ్యులతో కలిసి ఓ మ్యూజియం కూడా ఏర్పాటు చేయాలని కోరారు. ఆయన చివరి వరకు కాంగ్రెస్ పార్టీతోనే ఉన్నారని తెలిపారు. అలాంటి కమిట్‌మెంట్ యువతలో ఉండాలని, ప్రతి ఒక్కరిలో ఉండాలని మంత్రి లోకేశ్ సూచించారు.

## బాణాసంచా కర్మాగారంలో భారీ పేలుడు

(మొదటి పేజీ తరువాయి)

అగ్ని ప్రమాదం జరిగింది. ఓ బాణసంచా కర్మాగారంలో భారీ పేలుడు సంభవించి 11 మంది మృతిచెందగా.. మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ దారుణ ఘటన పిప్రి పోలీస్ స్టేషన్ పరిధి మనోరి గ్రామంలో చోటుచేసుకుంది. మృతులను ప్రియాంజలి (5), ప్రవీణ్ సింగ్ (13), జహన్వి (12), ఆదిత్య (12), ఆదిత్య (8), రవి (8), అంజు (32), జ్ఞాన్ సింగ్ (40), విక్రమ్ సరోజ్ (35), అన్ష్ (6), నానా (4)గా పోలీసులు గుర్తించారు. మృతులంతా ఫ్యాక్టరీ చుట్టుపక్కల నివసిస్తున్న వారేనని అధికారులు తెలిపారు. సోమవారం మధ్యాహ్నం వేళ బాణసంచా కర్మాగారంలో ఒక్కసారిగా భారీ పేలుడు సంభవించింది. ఈ పేలుడు స్థానికంగా బీభత్సం సృష్టించింది. భారీ శబ్దంతో పేలుడు జరగడంతో ఫ్యాక్టరీ చుట్టుపక్కల ఇళ్లని పూర్తిగా ధ్వంసమయ్యాయి. తీవ్రంగా గాయపడిన 16 మందిని ప్రయాగ్‌రాజ్‌లోని ఎస్‌ఆర్ఎన్ ఆస్పత్రికి తరలించగా.. 11 మంది చికిత్సపొందుతూ మరణించారని జిల్లా మేజిస్ట్రేట్ అమిత్ పాల్ తెలిపారు. మరో ఐదుగురికి చికిత్స అందుతోందని ఆయన వెల్లడించారు. ఈ ఘటనలో మొత్తం 18 మందికి పైగా గాయపడినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. శిథిలాలను తొలగిస్తూ వాటి కింద చిక్కుకున్న వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదంపై ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తీవ్ర దిగ్భ్రాం÷-రతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. 'కౌశాంబి జిల్లాలో ప్రమాదం తీవ్రంగా బాధించింది. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా. గాయపడిన వారికి సరైన వైద్య చికిత్స అందేలా చూడాలని, బాధిత కుటుంబాలకు అన్ని విధాలా సహాయం అందించాలని స్థానిక అధికారులకు ఆదేశాలు జారీ చేశాం. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ.2లక్షలు, గాయపడిన వారికి ఒక్కొక్కరికీ రూ.50 వేల చొప్పున ఆర్థిక సహాయం అందించాలని ఆదేశాలు జారీ చేశాం' అని ఎక్స్ వేదికగా పోస్టు చేశారు.

## ఎపి మద్యం కేసులో సిట్ తీరు

(మొదటి పేజీ తరువాయి)

న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. రాజ్‌కెసిరెడ్డి పోలీస్ కస్టడీపై నిజంగానే సీరియస్‌గా ఉన్నారా? అని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ముందస్తు బెయిల్ పెండింగ్‌లో ఉండగా ప్రొడక్షన్ వారెంట్ అడిగారని, అప్పటికే కస్టడీలో ఉన్న వ్యక్తి పారిపోయే అవకాశమే లేదని పేర్కొంది. కస్టోడియల్ ఇంటరాగేషన్ కోరితే.. జడ్జి మీకు ప్రొడక్షన్ వారెంట్ ఇచ్చారు కదా అని కోర్టు అడిగింది. పోలీసు కస్టడీకి ప్రిపేర్ కాలేదు.. జ్యుడిషియల్ కస్టడీ ఇవ్వమంటున్నారు.. ఇదేం ప్రవర్తన అని ప్రశ్నించింది. ప్రొడక్షన్ వారెంట్.. అరెస్ట్ వారెంట్‌తో సమానం పేర్కొంది.మరోవైపు ఏపీ మద్యం రవాణా కేసులో రాజ్ కెసిరెడ్డి, డి.వాసుదేవరెడ్డిలకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. విచారణ ప్రక్రియలో నిబంధనలను సరిగ్గా పాటించలేదనే కారణంతో హైకోర్టు ఆదేశాలను ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాలు చేసింది. దీంతో తదుపరి విచారణను సీజేఐ ధర్మాసనం వాయిదా వేసింది.

## వెలిగొండతో కరువు ప్రాంత రైతులకు కొత్త వెలుగు

**అమరావతి,మన జనప్రగతి ఆగస్టు 31:** వెలిగొండ ప్రాజెక్టుతో కరువు ప్రాంత రైతుల జీవితాల్లో కొత్త వెలుగులు వచ్చాయని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు సంతోషం వ్యక్తం చేశారు. రైతుల ఆశలు, ప్రజల ఆకాంక్షలను నిజం చేస్తున్న ప్రాజెక్టు వెలిగొండ అని అన్నారు. సాగునీరు, తాగునీరు, ఉపాధి, ప్రాంతీయ అభివృద్ధికి వెలిగొండ కొత్త అధ్యాయమని పేర్కొన్నారు. వెలిగొండ ప్రారంభోత్సవం కేవలం ఒక ప్రాజెక్టు ప్రారంభం కాదు.. కరువు సీమ భవిష్యత్తును మార్చే చారిత్రక ఘట్టమని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. సోమవారం రాజధాని అమరావతిలో మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. మూడు దశాబ్దాల వెలిగొండ ప్రాజెక్టు కలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సాకారం చేశారని తెలిపారు. 1996లో ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన ఆయన చేతుల మీదుగానే ఈ ప్రాజెక్టు జాతికి అంకితం కావడం చారిత్రాత్మక ఘట్టమని అభివర్ణించారు. సాగునీటి ప్రాజెక్టుల పూర్తి చేయడంపై సీఎం చంద్రబాబు ప్రత్యేక చొరవ తీసుకొంటున్నారనేందుకు వెలిగొండ నిలువెత్తు నిదర్శనమని పేర్కొన్నారు. 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే మహత్తర ప్రాజెక్టు ఇది అని తెలిపారు. కరువు, ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాల్లో లక్షలాది మందికి తాగునీటి భరోసా కల్పించే ప్రాజెక్టు ఇదని మంత్రి అచ్చెన్నాయుడు చెప్పారు. ప్రకాశం, మార్కాపురం, నెల్లూరు, కడప జిల్లాల రైతులకు వెలిగొండ వరప్రదాయిని అని వివరించారు. కృష్ణా వరద జలాలను కరువు నేలకు మళ్లించడం ద్వారా రైతుల పొలాలకు జీవం పోస్తున్నామని అన్నారు. వెలిగొండతో చెరువులు నిండుతాయని.. భూగర్భ జలాలు పెరుగుతాయని.. వ్యవసాయానికి కొత్త ఊపు వస్తుందని మంత్రి అచ్చెన్నాయుడు ధీమా వ్యక్తం చేశారు. కరువు కారణంగా జరిగే వలసలకు శాశ్వత పరిష్కారం చూపే జీవనరేఖ వెలిగొండ ప్రాజెక్టు అని ఆయన చెప్పారు. నిర్వాసిత కుటుంబాల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇచ్చిందని అన్నారు. 48 రోజుల్లోనే నిర్వాసిత కుటుంబాలకు రూ.762 కోట్ల పరిహారం అందించడం సీఎం చంద్రబాబు చిత్తశుద్ధికి నిదర్శనమని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. కరవు నేలకు కృష్ణా జలాలు తెచ్చిన అపర భగీరథుడు సీఎం చంద్రబాబు నాయుడు అని హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత విశాఖపట్నంలో తెలిపారు. 30 ఏళ్లుగా ఎదురుచూస్తున్న వెలిగొండ కల సాకారం అవుతోందని చెప్పారు. వెలిగొండ ప్రాజెక్ట్ ప్రారంభోత్సవం చారిత్రాత్మక ఘట్టం అని అభివర్ణించారు. సీఎం చంద్రబాబు నాయుడు దూరదృష్టితో ఈ ప్రాజెక్ట్ పూర్తయిందన్నారు.వెలిగొండ ప్రాజెక్టుతో కరువు ప్రాంతాల్లో రైతుల జీవితాల్లో కొత్త వెలుగులు వస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు.

మనజనప్రగతి

01- 09 - 2026

# మిట్టమల్లేశ్వరునికి శ్రావణ సోమవార విశేష పూజలు,అభిషేకాలు



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి ఆగస్టు 31:** పులివెందుల పట్టణంలోని గుంత బజార్ సమీపంలో వెలసిన ప్రసిద్ధ పురాతన శ్రీ మిట్టమల్లేశ్వర స్వామి ఆలయంలో శ్రావణమాసం సోమవారాన్ని పురస్కరించుకుని స్వామివారికి విశేష పూజలు, అభిషేకాలు వైభవంగా నిర్వహించారు.తెల్లవారుజాము నుంచే ఆలయ ప్రధాన అర్చకులు రుద్ర,శివ స్వాముల ఆధ్వర్యంలో శ్రీ మిట్టమల్లేశ్వరునికి పంచామృతాభిషేకం, భస్మాభిషేకం,సహస్రనామ అష్టోత్తర శతనామావళి,లింగాష్టక పఠనంతో విశేష పూజా కైంకర్యాలు జరిపారు. అనంతరం స్వామివారిని భక్తుల దర్శనార్థం ప్రత్యేక అలంకారంలో తీర్చిదిద్దారు.ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు మాట్లాడుతూ ఆలయంలో నిత్యం ధూప, దీప,నైవేద్యాలతో విశేష పూజలు ఘనంగా జరుగుతున్నాయని తెలిపారు.శ్రావణ సోమవారం కావడంతో పట్టణ పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, దేవాదాయ శాఖ (ఎండోమెంట్స్) అధికారులు మరియు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# పదవీ విరమణ పొందిన ముగ్గురు పోలీసులకు సన్మానం




**కర్నూలు బ్యూరో మన జనప్రగతి ఆగస్టు 31:-** పోలీస్ శాఖలు వీళ్ళ హోదాలో పనిచేసి పదవి విరమణ పొందిన పోలీస్ సిబ్బందికి ఉన్నతాధికారులు సోమవారం ఘనంగా సన్మానించారు. పదవి విరమణ పొందిన వారిలో ఎ. ఎస్సై.పి ఎం.అలీఖాన్ - కర్నూలు ఒకటవ పట్టణ పియస్ఎ.ఎస్సై హెచ్.పి. ఫకృద్దీన్ - పత్తికొండ పియస్, హెడ్ కానిస్టేబుల్ జె.తిరుపాలు - పిసిఆర్ - కర్నూలు,పదవి వీరమణ పొందారు. కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో పదవి వీరమణ పొందిన పోలీసులను శాలువ, పూలమాలతో కర్నూలు ఎఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్ సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. కర్నూలు ఎ.ఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్ మాట్లాడుతూ...కుటుంబాలతో సంతోషంగా గడపాలని,పదవివీరమణ పొందిన తర్వాత ఏమైనా సమస్యలుంటే నేరుగా జిల్లా ఎస్పీ గారిని సంప్రదించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఐ నారాయణ,జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షులు నాగరాజు, పదవీ విరమణ పొందిన పోలీసు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.


# నిత్యావసర ధరలు పెరుగుతుంటే ప్రభుత్వం చోద్యం చూస్తుందా..?

**- ధరలను వెంటనే తగ్గించాలి:సీపీఎం,సీఐటీయూ**




**పత్తికొండ మన జనప్రగతి ఆగస్టు 31:**-నిత్యావసర వస్తువుల ధరలు రోజురోజుకూ పెరుగుతూ పేద, మధ్యతరగతి ప్రజలపై తీవ్ర భారం మోపుతున్నా ప్రభుత్వం పట్టించుకోకుండా చోద్యం చూస్తోందని సీపీఎం, సీఐటీయూ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పెరిగిన ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం పత్తికొండ పట్టణంలో భారీ నిరసన ర్యాలీ, ధర్నా నిర్వహించారు.స్థానిక కామ్రేడ్ ఎర్రగుడి ఈశ్వర్‌రెడ్డి భవనం నుంచి ప్రారంభమైన ర్యాలీ పట్టణంలోని ప్రధాన వీధుల మీదుగా నాలుగు స్తంభాల వద్దకు చేరుకుంది. అక్కడ నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ధర్నా చేపట్టారు. వ్యవసాయ కార్మిక సంఘం పట్టణ కార్యదర్శి నరసన్న అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి చక్రాల వెంకటేశ్వర్‌రెడ్డి, సీఐటీయూ మండల కార్యదర్శి ఎం.రవిచంద్ర పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదలపై నిత్యావసర ధరల భారం మరింత పెరిగిందని విమర్శించారు. ఎన్నికల సమయంలో ధరలను తగ్గిస్తామని ఇచ్చిన హామీలను ప్రభుత్వం విస్మరించిందన్నారు. కూరగాయలు, పప్పులు, వంట నూనెలు, ఇతర నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతుండటంతో పేద కుటుంబాలపై తీవ్ర ఆర్థిక భారం పడుతోందన్నారు.ధరలను నియంత్రించడంలో ప్రభుత్వం విఫలమైతే ప్రజాగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రజల కష్టాలను దృష్టిలో పెట్టుకుని వెంటనే నిత్యావసర ధరలను తగ్గించి ఉపశమనం కల్పించాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు రామాంజనేయులు, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు శికామణి, సీనియర్ నాయకులు వెంకటేశ్వర్లు, రైతు సంఘం ఉపాధ్యక్షులు రాజుల కారప్ప, హమాలీ కార్మిక సంఘం కార్యదర్శి ఉరుకుందు, గోడౌన్ హమాలీ కార్మిక సంఘం కార్యదర్శి చంద్ర, సీపీఎం నాయకులు చంద్ర, మాణిక్యం, ఉదయ్, నరసింహ, ఆచారి, చిన్న హుస్సేన్, పెద్ద హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి పునఃప్రతిష్ఠ మహోత్సవం



**తొండూరు మన జనప్రగతి ఆగస్టు 31:**-తొండూరు మండల కేంద్రంలోని శివాలయం ఆవరణలో కొలువైన శ్రీ లక్ష్మీ చెన్నకేశవ, శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానంలో ధ్వజ ప్రతిష్ఠ, శ్రీ చెన్నకేశవ స్వామి పునఃప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాలు సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో ఉదయం గణపతి పూజ, స్వస్తివాచనం, పంచగవ్య శుద్ధి, రక్షాబంధనం, మహా మంగళహారతి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.సాయంత్రం అంకురార్పణ, నవగ్రహ పూజ, అష్టదిక్పాలకుల ఆహ్వానం, సర్వదేవతల కలశస్థాపన, అగ్నిప్రతిష్ఠ, బింబ జలాధివాసం, మహా మంగళహారతి కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేకువజాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు, హోమ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ పెద్దలు, గ్రామ ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి ఛాంపియన్‌షిప్‌లో కర్నూలు జిల్లా క్రీడాకారుల ప్రతిభ

**వివిధ విభాగాల్లో స్వర్ణ,రజత,కాంస్య పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందించిన జిల్లా కలెక్టర్**




**కర్నూలు బ్యూరో మన జనప్రగతి ఆగస్టు 31:**-ఆగస్టు 24 నుండి 26వ తేదీ వరకు తిరుపతిలో నిర్వహించిన అమరావతి ఛాంపియన్‌షిప్ పోటీల్లో కర్నూలు జిల్లాకు చెందిన క్రీడాకారులు వివిధ విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి స్వర్ణ, రజత, కాంస్య పతకాలు సాధించిన క్రీడాకారులను జిల్లా కలెక్టర్ అభినందించి, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక పి.జి.ఆర్.ఎస్ కార్యక్రమంలో పాల్గొని, వివిధ విభాగంలో మెడల్ సాధించిన క్రీడాకారులను అభినందించారు.ఈ సందర్భంగా అథ్లెటిక్స్ విభాగంలో, 800 మీటర్ల పరుగులో అండర్-23 విభాగానికి చెందిన రామాంజనేయులు స్వర్ణ పతకం సాధించారు. అండర్-17 విభాగంలో మనీష్ అశ్విని కుమార్ నాయుడు రజత పతకం కైవసం చేసుకున్నారు. 100 మీటర్ల పరుగులో అండర్-23 విభాగానికి చెందిన కె. మంజు కాంస్య పతకం సాధించగా,హైజంప్ విభాగంలో కూడా కాంస్య పతకం సాధించారు. వెయిట్‌లిఫ్టింగ్ విభాగంలో, 60 కిలోల విభాగంలో డి.జి. వీరేష్ స్వర్ణ పతకం, 65 కిలోల విభాగంలో బి. వీరేష్ స్వర్ణ పతకం సాధించారు. +110 కిలోల విభాగంలో పర్వేజ్ ముషారఫ్ రజత పతకం కైవసం 75 కేజీల విభాగంలో అబ్దుల్ హక్ బ్రాంజ్ మెడల్ కైవసం చేసుకున్నారు. అండర్-17 బాలుర విభాగంలో 95 కిలోల కేటగిరీలో షేక్ అఫ్రుద్ స్వర్ణ పతకం, 70 కిలోల విభాగంలో షేక్ సాద్ రజత పతకం, 75 కిలోల విభాగంలో షేక్ జైద భాషా రజత పతకం సాధించారు. 65 కిలోల విభాగంలో వి. సాయి నితేష్ మూడో స్థానం సాధించి కాంస్య పతకం పొందారు. యోగ విభాగంలో ధన ధీరజ్ రజత పతకం సాధించి జిల్లా ప్రతిష్టను ఇనుమడింపజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...క్రీడాకారులు క్రమశిక్షణ, కఠోర శ్రమతో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో కర్నూలు జిల్లా కీర్తిని మరింత ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి (డీఎస్‌డీఓ) భూపతిరావు, వెయిట్‌లిఫ్టింగ్ కోచ్ యూసఫ్ భాష, అథ్లెటిక్స్ కోచ్ కాశిరావు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

**పీజీఆర్ఎస్‌లో 'రీ-ఓపెన్', 'ఇంప్రాపర్ రెడ్రెసల్' కేసులు పూర్తిగా తగ్గాలి: జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి.**



**కర్నూలు బ్యూరో మన జనప్రగతి ఆగస్టు 31:**-ప్రజా సమస్యల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా ప్రతి అర్జీని అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారాలు అందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల వినతులను జిల్లా కలెక్టర్, స్వీకరించారు. ప్రతి ఫిర్యాదుపై అధికారులు సత్వరంగా స్పందించి,పరిష్కరించాలని,అర్జీదారులకు అందించే ఎండార్స్‌మెంట్‌లు స్పష్టంగా, పూర్తి వివరాలతో ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. పరిష్కరించడం సాధ్యం కాని సమస్యల విషయంలో అందుకు గల కారణాలను అర్జీదారులకు స్పష్టంగా తెలియజేయాలని ఆదేశించారు. పీజీఆర్ఎస్‌లో నమోదవుతున్న 'రీ-ఓపెన్', 'ఇంప్రాపర్ రెడ్రెసల్' కేసులను పూర్తిగా తగ్గించేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. ఒకసారి పరిష్కరించిన అర్జీ మళ్లీ రీ-ఓపెన్ అయ్యే పరిస్థితి రాకుండా, సమస్యకు సంబంధించిన అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించి నాణ్యమైన పరిష్కారం అందించాలని సూచించారు. నిబంధనల పరిధిలో సాధ్యమైనంత త్వరగా సమస్యలను పరిష్కరించి, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. అర్జీలను గడువు లోపు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. సెప్టెంబర్ 30 నాటికి 22-ఏ కింద పరిష్కరించిన అన్ని భూముల వివరాలు తప్పనిసరిగా ఆన్‌లైన్ అడంగల్ పోర్టల్‌లో ప్రతిబింబించేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. నిర్ణీత గడువులోగా వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి, క్షేత్రస్థాయి రికార్డులకు అనుగుణంగా సక్రమంగా అప్‌డేట్ చేయాలని జిల్లా కలెక్టర్ సంబధిత అధికారులకు ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు అనురాధ, శివ ప్రసాద్ రెడ్డి, రామ సుబ్బయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# రీఓపెన్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించాలి





**పిజిఆర్ఎస్‌కు 272 ప్రజా దరఖాస్తులు**

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**

**నంద్యాల, మన జనప్రగతి ఆగస్టు 31:**ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా స్వీకరించే అర్జీలను రీఓపెన్ కాకుండా ఉండే విధంగా ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం అనంతరం వివిధ అంశాలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో డిఆర్ఓ రాము నాయక్, పిజిఆర్ఎస్ నోడల్ ఆఫీసర్ ఉమామహేశ్వరి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.... రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్క అర్జీదారుడి దరఖాస్తును నాణ్యతతో పరిష్కరించేలా కృషి చేయడం జరుగుతోందన్నారు. అందులో భాగంగా అన్ని దరఖాస్తులను అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కరించాలన్నారు. రీఓపెన్ అర్జీలకు సంబంధించి 5,513 రీఓపెన్ కాగా 5,444 నాణ్యతతో పరిష్కరించామని మిగతా 69 వాటిని కూడా అర్జీదారుడితో మాట్లాడి నిర్ణీత గడువులోగా పూర్తి చేస్తామన్నారు. రీఓపెన్ దరఖాస్తుల్లో రెవెన్యూ, పంచాయతీ రాజ్ అత్యధికంగా రీఓపెన్ కావడం జరిగిందని సంబంధిత శాఖలు దృష్టి సారించి పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

**రెవెన్యూ క్లినిక్స్ ద్వారా 137 అర్జీల స్వీకరణ**

భూ సమస్యలను సమగ్రంగా పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన రెవెన్యూ క్లినిక్స్ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నామని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ క్లినిక్స్ ద్వారా భూ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వేగంగా పరిష్కరించే అవకాశం ఉందన్నారు. రెవెన్యూ క్లినిక్స్ ద్వారా మొత్తంగా 137 దరఖాస్తులు స్వీకరించగా వాటిలో రెవెన్యూ, గ్రామ/వార్డు సచివాలయ సేవలకు సంబంధించినవి 6, అడంగల్ సవరణలకు సంబంధించినవి 16, చుక్కల భూముల క్రమబద్ధీకరణ, 22-ఎ భూములకు సంబంధించినవి 6, అసైన్డ్ భూములు, భూ ఆక్రమణలకు సంబంధించినవి 25, రెవెన్యూ కోర్టు విచారణలు/ఆర్ఓఆర్‌కు సంబంధించినవి 35, సర్వే, రీ-సర్వేలకు సంబంధించినవి 40, దేవాదాయ, వక్ఫ్ భూములకు సంబంధించినవి 9గా ఉన్నాయని కలెక్టర్ వివరించారు.

**పిజిఆర్ఎస్ ద్వారా స్వీకరించిన కొన్ని ప్రజా సమస్యలు**

1) బనగానపల్లె మండలం, కటికవనికుంట గ్రామానికి చెందిన వాడల సావిత్రి తన భర్త అనారోగ్యంతో మరణించారని, వితంతు పెన్షన్ మంజూరు చేయగలరని కోరుతూ జిల్లా కలెక్టర్ కు దరఖాస్తు సమర్పించారు. 2) వెలుగోడు మండలం, వెలుగోడు గ్రామానికి చెందిన వి.మధు సతీష్ తను పుట్టుకతోనే చూపులేనప్పటికీ డిగ్రీ విద్యను అభ్యసించడం జరిగిందని, ఆర్థికంగా చాలా ఇబ్బందులు గురవుతున్నామని, విద్యార్హత మేరకు ఏదైనా ఉపాధి కల్పించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కు దరఖాస్తు సమర్పించారు. 3) సిరివెళ్ళ మండలం, గుండంపాడు గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఉన్న స్మశానాన్ని కొందరు దౌర్జన్యంగా ఆక్రమించుకుం టున్నారని అందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కు దరఖాస్తు సమర్పించారు.

# వడ్డెరల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

**● వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ విభాగం ఉపాధ్యక్షులు వల్లేపు వరప్రసాద్ ● కమతంపల్లిలో ఘనంగా వడ్డెర విముక్త విమోచన దినోత్సవం**



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి ఆగస్టు 31:** పుంగనూరు నియోజకవర్గ పరిధిలోని కమతంపల్లి గ్రామంలో వడ్డెర విముక్త విమోచన దినోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ విభాగం ఉపాధ్యక్షులు,పులివెందుల మాజీ మున్సిపల్ చైర్మన్ వల్లేపు వరప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో వడ్డెర కులస్తుల పాత్ర ఎనలేనిదని కొనియాడారు.చారిత్రకంగా ఎదుర్కొన్న వివక్షను అధిగమించి,విముక్త జాతులుగా గుర్తింపు పొందిన ఈ దినోత్సవాన్ని గుర్తు చేసుకుంటూ,సమాజంలో మరింత ఆర్థిక,సామాజిక ఎదుగుదలను సాధించాలని ఆకాంక్షించారు.ముఖ్యంగా నేటి సమాజంలో వడ్డెర వర్గాల యువత ఉన్నత విద్యను అభ్యసించి రాజకీయంగా,ఆర్థికంగా ఉన్నత స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు,వడ్డెర సంఘం ప్రతినిధులు,గ్రామ పెద్దలు మరియు యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట

**- రహదారి తొలగించిన రెవెన్యూ అధికారులు**



**సిద్ధవటం మన జనప్రగతి ఆగస్టు 31:**-పెన్నా నది పరివాహక ప్రాంతాల్లో అక్రమంగా ఇసుక తవ్వకాలు, రవాణా జరుగుతున్నట్లు రైతుల నుంచి ఫిర్యాదులు అందడంతో అడ్డుకట్ట వేసినట్లు సిద్ధవటం తహసీల్దార్ విజయకుమార్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం స్థానిక ప్రజలు తమ గృహ అవసరాల కోసం మాత్రమే ట్రాక్టర్ల ద్వారా ఇసుకను ఉచితంగా తరలించుకునేందుకు అనుమతించిందన్నారు. అయితే ఉచిత ఇసుక విధానాన్ని అడ్డుపెట్టుకుని ఉక్కాయిపల్లి సమీపంలోని పెన్నా నదిలో ఊరగాయవంక ప్రాంతం వద్ద జేసీబీలతో ఇసుక తవ్వకాలు చేపట్టి కడపకు అక్రమంగా తరలిస్తున్నట్లు రైతులు ఫిర్యాదు చేశారని తెలిపారు. దీంతో అక్రమ రవాణా జరగ కుండా సంబంధిత రహదారిని తొలగించినట్లు చెప్పారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తవ్వి అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ హెచ్చరించారు.

# నిత్యవసర వస్తువుల ధరలను నియంత్రించాలి



**చిట్వేలి మన జనప్రగతి ఆగస్టు 31:**-పెరుగుతున్న పెట్రోల్, డీజిల్, గ్యాస్, కూరగాయలు, వంట నూనెలు, నిత్యవసర వస్తువుల ధరలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే అదుపు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు పందికాళ్ళ మణి డిమాండ్ చేశారు. సోమవారం చిట్వేలి మండల కేంద్రంలో జరిగిన రైతు సంఘం సభ్యుల సమావేశంలో మణి మాట్లాడుతూ నిత్యవసర ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, సామాన్య, మధ్యతరగతి, నిరుపేద ప్రజలు కొనలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెంటనే నిత్యవసర వస్తువులు, పెట్రోల్, డీజిల్, గ్యాస్, వంట నూనెలు, కూరగాయలు ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర ఎందుకు కల్పించలేదని ప్రశ్నించారు. మార్కెట్ లో కేజీ వంటనూనె 180 నుండి 190 రూపాయలు పలుకుతోందని, కూరగాయల ధరలు సామాన్య ప్రజలు కొనలేని స్థితిలో ఉన్నారన్నారు. పెరుగుతున్న నిత్యవసర ధరలను అదుపు చేసేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో ప్రజా సంఘాలను కలుపుకొని ఐక్య పోరాటాలకు సిద్ధమవుతాం అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి కటారి శంకరయ్య, సహాయ కార్యదర్శి నరసింహ ఆచారి, నాయకులు ఒలిమి నాగయ్య పాల్గొన్నారు.

# భారతీయ జనతా పార్టీ అభివృద్ధి కొరకు కష్టపడతాం

**● బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మన సుబ్బరాయుడు**



**కడప మన జనప్రగతి ఆగస్టు 31:**-భారతీయ జనతా పార్టీ అభివృద్ధి కొరకు ,పార్టీప్రతిష్ట కొరకు కష్టపడి పని చేస్తానని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మన సుబ్బరాయుడు తెలిపారు. సోమవారం ఈ సందర్భంగా జిల్లా భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల తో అయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నాపై నమ్మకం ఉంచి రాష్ట్ర కార్యదర్శిగా నియమించినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి, ఆంధ్రప్రదేశ్ బిజెపి అధ్యక్షుడు మాధవ్ కు ,ఆరోగ్య శాఖ మంత్రి సత్య నాథ్ ,జిల్లా అధ్యక్షుడు జంగటివెంకట సుబ్బారెడ్డి, మీడియా ముఖంగా ధన్యవాదాలు తెలిపారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం భాగంగా బిజెపి పార్టీని అంచలంచలుగా అభివృద్ధి పరుస్తామని తెలిపారు. ప్రజలలో బలమైన నాయకులను ఎన్నుకొని వారి గెలుపే ధ్యేయంగా మేమంతా కృషి చేస్తామని తెలిపారు. సర్పంచి, ఎంపీటీసీ, జడ్పిటిసి. మున్సిపాలిటీ. కార్పొరేషన్ ఎన్నికల్లో బీసీలకు కావాల్సిన 34 శాతం రిజర్వేషన్ అమలు చేస్తామని తెలిపారు. గతంలో బీసీ సీట్లను ముస్లింలకు కేటాయించే వారిని తెలిపారు. భారతీయ జనతా పార్టీ దేశమును ప్రేమించే ప్రతి ఒక్కరికి నచ్చుతుందని తెలిపారు. కూటమిలో భాగంగా బిజెపికి వచ్చే సీట్లను బట్టి ఎవరికి ఏ టికెట్ ఇవ్వాలని రాష్ట్ర అధినాయకత్వం నిర్వహిస్తుందని తెలిపారు.అభ్యర్థులను నిర్ణయించేది రాష్ట్ర నాయకత్వమే అని తెలిపారు.ఎస్సీ ఎస్టీ బీసీలకు కేటాయించిన రిజర్వేషన్లను మొత్తం వారికే చెందే విధంగా కృషి చేస్తామన్నారు. పార్టీ కోసం కష్టపడ్డ వారికి మొదటి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. జిల్లా అధ్యక్షులు జంగటి వెంకటసుబ్బారెడ్డి,బొమ్మన విజయ్, కామినేని ప్రవీణ్ నాయుడు పాల్గొన్నారు.

# మార్కెట్ కమిటీ అభివృద్ధి సహకరిస్తాను:మంత్రి సుభాష్

**- ఘనంగా కాకినాడ రూరల్ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం**





**కాకినాడ మన జనప్రగతి ఆగస్టు 31**:-నూతనంగా ఎన్నికైన కాకినాడ రూరల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. కాకినాడ రూరల్ వ్యవసాయం మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం మహోత్సవం సోమవారం కాకినాడ ఇంద్రపాలెంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో ఘనంగా జరిగింది. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వర రావు (నానాజీ)అధ్యక్షత వహించారు.నూతనంగా ఎన్నికైన కాకినాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, పాలకవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం మహోత్సవంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ కూటమిలో పనిచేసిన అందరికీ గుర్తింపు ఉంటుందని చెప్పారు. గడచిన రెండున్నర ఏళ్ల హయాంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు ఎన్నో నిర్వహించామని చెప్పారు. ప్రతిపక్ష వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని అభివృద్ధితో ఐక్యంగా తిప్పుకొట్టాలని పిలుపునిచ్చారు.మార్కెట్ కమిటీ చైర్మన్ మాసుమేను మంగ మాట్లాడుతూ మంత్రులు,ఎమ్మెల్యేలు, ఎమ్మెల్యేలు ఇతర ప్రజాప్రతినిధుల సహకారంతో మార్కెట్ కమిటీ అభివృద్ధికి నిరంతరం పనిచేస్తానని చెప్పారు. అనంతరం మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులను ప్రమాణ స్వీకారం చేయించారు.ఇంకా ఈ కార్యక్రమంలో ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్,ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, పిల్లి సత్యనారాయణమూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాస్ బాబా,రంబాల వెంకటేశ్వరరావు, చైల్డ్ రైస్ కమిషన్ చైర్మన్ సూర్యనారాయణ రాజు, కరప ఏఎంసీ చైర్మన్ ముద్రగడ్డ రమేష్, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ, మాజీ జడ్పీటీసీ నులుకుర్తి వెంకటేశ్వరరావు, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, గోదావరి డెల్టా నీటి సంఘం అధ్యక్షులు సునీల్, కుడా చైర్మన్ తలాటం సత్య, ఎంపీపీ నందిపాటి అనంతలక్ష్మి, టీడీపీ, జనసేన, బీజేపీలకు చెందిన కూటమి నాయకులు పాల్గొన్నారు..

# విఘ్నేశ్వరుని ఆలయ ప్రారంభోత్సవంలో ముక్కా వరలక్ష్మి



**చిట్వేలి మన జనప్రగతి ఆగస్టు 31:**-పెనగలూరు మండలం ఓబిలి బీసీ కాలనీలో నూతనంగా నిర్మించిన శ్రీ విఘ్నేశ్వరుని ఆలయ ప్రారంభోత్సవంలో రైల్వే కోడూరు నియోజకవర్గ టీడీపీ నాయకురాలు ముక్కా వరలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో భక్తులు, బీసీ కాలనీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా వరలక్ష్మి మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి కృషి చేసిన ప్రతి ఒక్కరిని అభినందించారు. గ్రామాల్లో ఆధ్యాత్మికతతో పాటు ఐక్యత, సామాజిక సేవా భావం మరింత పెంపొందాలని ఆకాంక్షించారు. శ్రీ విఘ్నేశ్వర స్వామివారి ఆశీస్సులు ప్రజలందరిపైనా ఉండాలని ఆమె కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌డిఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు, ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భోజనంలో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి

**● ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి**

**● పులివెందుల స్మార్ట్ కిచెన్‌లో ఎమ్మెల్సీ భూమిరెడ్డి ఆకస్మిక తనిఖీ**





**పులివెందుల అర్బన్ మన జనప్రగతి ఆగస్టు 31:**-ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో నాణ్యతా ప్రమాణాలు పాటించడం తప్పనిసరి అని శాసనమండలి సభ్యులు (ఎమ్మెల్సీ) భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు.స్థానిక పట్టణంలోని సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్‌ను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి,ఆహార తయారీ మరియు సరఫరా ప్రక్రియను స్వయంగా పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడతూ విద్యార్థుల ఆరోగ్యం,భద్రత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడే ప్రసక్తే లేదని వంట తయారీ నుంచి పాఠశాలలకు చేరే వరకు సిబ్బంది పూర్తి బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు.స్మార్ట్ కిచెన్ నుంచి పాఠశాలలకు పంపిణీ అవుతున్న మధ్యాహ్న భోజన నాణ్యత, కిచెన్ పరిసరాల పరిశుభ్రత, అలాగే విద్యార్థులకు అందిస్తున్న కోడిగుడ్ల నాణ్యతను ఎమ్మెల్సీ ప్రత్యక్షంగా తనిఖీ చేశారు.ఈ వంటశాల ద్వారా నియోజకవర్గంలోని ఏయే ప్రభుత్వ పాఠశాలలకు భోజనం సరఫరా అవుతోందో సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.ప్రభుత్వం నిర్ణయించిన మెనూ ప్రకారం ప్రతిరోజూ విద్యార్థులకు రుచికరమైన,పరిశుభ్రమైన మరియు పౌష్టికాహారాన్ని మాత్రమే అందించాలని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి ఆదేశించారు.

# రాజపూడి రైతుల సమస్యలపై స్పందించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

**- క్యాంప్ ఆఫీసులో రైతులతో భేటీ**



**కాకినాడ/జగ్గంపేట మన జనప్రగతి ఆగస్టు 31:**-స్థానిక రావులమ్మ నగర్ లోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో జగ్గంపేట శాసనసభ్యులు, టీటీడీ బోర్డు సభ్యులు, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు జ్యోతుల నెహ్రూను జగ్గంపేట మండలం రాజపూడి గ్రామానికి చెందిన రైతులు కలిసి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ రాజపూడి గ్రామ పరిధిలోని సర్వే నెంబర్లు 95/1,సర్వే నెంబర్ నుండి 95/8 సర్వే నంబర్ వరకు సంబంధించిన 22/ూ లో ఉన్న 10 ఎకరాల భూమి, 389/1 సర్వే నెంబర్లు 3 ఎకరాల 20 సెంట్లు,381/1 సర్వే నంబర్ లో 1ఎకరం 50 సెంట్లు భూమికి రాజపూడి కి చెందిన రైతుల భూమి సమస్యపై వినతిపత్రం అందజేశామని . పూర్వం నుండి సాగు చేసుకుంటున్న తమ భూములకు సంబంధించి ఎదురవుతున్న ఇబ్బందులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లామన్నారు.ఈ సందర్భంగా జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ రాజపూడి రైతుల సమస్యను పరిశీలించి, రెవెన్యూ, దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులతో మాట్లాడి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. రైతులకు అండగా ఉంటానని, వారి భూముల విషయంలో ఎలాంటి అన్యాయం జరగనివ్వనని స్పష్టం చేశారు.పేద బలహీన వర్గాల రైతులు కు అన్యాయం జరగకుండా న్యాయం చేయాలని రైతులు ఎమ్మెల్యేను కోరారు.ఈ కార్యక్రమంలో రేఖ బుల్లి రాజు, ఉప్పలపాటి బుల్లెబ్బు, తాండ్రంగి అచ్చారావు, ముమ్మన దుర్గాప్రసాద్, గుడేల శ్రీను, బొగ్గవరపు మూర్తి, బత్తుల గంగాధర్, పినిశెట్టి సుబ్రహ్మణ్యం, బొడ్డు ప్రసాద్, నంగన సత్తిబాబు, కే దుర్గాప్రసాద్, తాండ్రంగి అర్జున్, నంగన వెంకటరమణ తదితరు రైతులు పాల్గొన్నారు.

# సిద్ధవటేశ్వరాలయంలో నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠ

**● శాస్త్రోక్తంగా విశేష పూజలు.. ● భక్తులకు మౌలిక వసతులు కల్పిస్తాం ● దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షుడు రమేష్‌నాయుడు**



**సిద్ధవటం మన జనప్రగతి ఆగస్టు 31:**-శ్రీశైల దేవస్థానం దత్తత దేవాలయమైన సిద్ధవటంలోని శ్రీకామాక్షీసమేత సిద్ధవటేశ్వరస్వామి ఆలయంలో నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠా కార్యక్రమాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. మూడు రోజులుగా కొనసాగిన ధ్వజస్తంభ మహోత్సవంలో భాగంగా ఉదయం వేదపారాయణాలు, జపాలు నిర్వహించి, నిర్ణీత సుముహూర్తంలో ఉదయం 10.51 గంటలకు ధ్వజస్తంభాన్ని శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించారు. ధ్వజస్తంభ ప్రతిష్ఠ అనంతరం ఆలయ ఆగమ సంప్రదాయాల ప్రకారం ఎనిమిది దిక్కుల్లోని దేవతలకు బలిహరణ, పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అవభృథం, మహదాశీర్వచనంతో కార్యక్రమాలు ముగిశాయి. ఆలయంలో ధ్వజస్తంభానికి విశిష్టమైన ప్రాధాన్యత ఉందని, ఉత్సవాది కార్యక్రమాల్లో ధ్వజారోహణకు ఇది అత్యంత అవసరమని వేదపండితులు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీశైల దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షుడు పోతుగుంట రమేష్‌నాయుడు, కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు దంపతులు, రాజంపేట పార్లమెంటు జనసేన పార్టీ సమన్వయ కర్త అతికారి క్రిష్ణ, ధర్మకర్తల మండలి సభ్యుడు చిట్టిబొట్ల భరద్వాజశర్మ, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రమేష్‌నాయుడు మాట్లాడుతూ సిద్ధవటం, జ్యోతి ఆలయాలను దశలవారీగా అభివృద్ధి చేస్తామని, అధిక సంఖ్యలో భక్తులు ఆలయాలను సందర్శించేలా విస్తృత ప్రచారం కల్పిస్తామని తెలిపారు. కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు మాట్లాడుతూ దేవస్థానం దత్తత తీసుకున్నప్పటి నుంచి ఆలయ కైంకర్యాలను ఆగమశాస్త్ర సంప్రదాయాల ప్రకారం నిర్వహిస్తున్నామని, భక్తులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో స్వామివారి ప్రధానార్చకులు హెచ్. వీరయ్యస్వామి, అమ్మవారి ఆలయ ప్రధానార్చకులు వై. విజయకుమార్, వేదపండితులు గంటిరాధాకృష్ణశర్మ అవధాని, వైదిక సిబ్బంది, అర్చకులు, అధికారులు, సిబ్బంది కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# పెడబల్లె గణేష్‌రెడ్డి మృతి బాధాకరం

**● మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి,రెడ్యం వెంకటసుబ్బారెడ్డి నివాళి**



**చెన్నూరు మన జనప్రగతి ఆగస్టు 31:-**మంచి మనిషిగా, నిజాయితీ, నిబద్ధత కలిగిన సీనియర్ నాయకుడిగా ప్రజలతో మమేకమైన పెడబల్లె గణేష్‌రెడ్డి మృతి అత్యంత బాధాకరమని మైదుకూరు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు.చెన్నూరు రెడ్డివీధికి చెందిన కడప మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పెడబల్లె గణేష్‌రెడ్డి (66) అనారోగ్యంతో హైదరాబాద్‌లోని తన కుమార్తె స్వగృహంలో ఆదివారం తెల్లవారుజామున మృతి చెందారు. అనంతరం ఆయన భౌతికకాయాన్ని చెన్నూరులోని స్వగృహానికి తీసుకువచ్చారు.సోమవారం ఉదయం గణేష్‌రెడ్డి స్వగృహానికి చేరుకున్న మైదుకూరు మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కమలాపురం నియోజకవర్గ పరిశీలకుడు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఆర్.వి.ఎస్.ఆర్ తదితరులు ఆయన భౌతికకాయంపై పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.గణేష్‌రెడ్డి సోదరుడు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ పెడబల్లె ప్రతాపరెడ్డి, కుమారుడు పెడబల్లె ప్రదీప్‌రెడ్డితో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించిన నాయకులు వారికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా శెట్టిపల్లె రఘురామిరెడ్డి మాట్లాడుతూ.. గణేష్‌రెడ్డి వంటి మంచి మనిషి, నిజాయితీగల నాయకుడిని కోల్పోవడం పార్టీకి, వ్యక్తిగతంగా తమకు తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు.అనంతరం సోమవారం ఉదయం 9 గంటలకు చెన్నూరు పెన్నా నది వద్ద గణేష్‌రెడ్డి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పలువురు రాజకీయ నాయకులు, బంధువులు, స్నేహితులు, అభిమానులు హాజరై కన్నీటి వీడ్కోలు పలికారు.

# ఖనిజ నిక్షేపాలను తొక్కిపెట్టి కార్మికుల భవిష్యత్తుతో ఆడుకోవద్దు




**చిట్వేలి మన జనప్రగతి ఆగస్టు 31:-**ప్రపంచ ప్రసిద్ధి చెందిన మంగంపేట ఏపీఎండీసీ బైరటీస్ మైనింగ్ విషయంలో కూటమి ప్రభుత్వం తీవ్రమైన కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని వైసిపి రాయలసీమ జోన్ బూత్ కమిటీ కన్వీనర్, డిఆర్‌యుసిసి సభ్యులు, తల్లెం భరత్ కుమార్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.మంగంపేటలో ఆయన మాట్లాడుతూ మంగంపేటలో వేలాది కోట్ల విలువైన ఖనిజ నిక్షేపాలు, ఫుల్లరీన్ ఉన్నాయని గతంలోనే అనేక పరిశోధనలు స్పష్టం చేశాయని గుర్తుచేశారు. 2005-2008 కాలంలో 'జిఆర్‌టిసి' ద్వారా, ఆపై 2023లో భువనేశ్వర్‌కు చెందిన సంస్థ ద్వారా, అలాగే ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్ ద్వారా వైట్ సేల్, బ్లాక్ సేల్ మినరల్స్‌పై అధ్యయనాలు జరిగినట్లు తెలిపారు. ఏపీఎండీసీ సీపీఓ కూడా ఈ నిక్షేపాలు ఉన్నట్లు గతంలో ధృవీకరించారన్నారు. 2026 జనవరి 1 నుండి మార్చి 31 వరకు కేవలం మూడు నెలల వ్యవధిలోనే 8,73,159 క్యూబిక్ మీటర్ల వ్యర్థ మట్టితో మైనింగ్ పూడ్చివేశారని విమర్శించారు. ఐబీఎం, మైనింగ్ శాఖ ప్లానింగ్ అనుమతులు లేకుండా ఖనిజ నిక్షేపాలు ఉన్న ప్రాంతాన్ని ఇలా మట్టితో పూడ్చడానికి అనుమతి ఎవరిచ్చారని ప్రశ్నించారు. మంగంపేటలో మైనింగ్ కోసం భూములు, ఇళ్లు త్యాగం చేసిన 750కి పైగా కుటుంబాల ఉద్యోగులు,వేలాది మంది కార్మికులు ఇక్కడ ఉపాధి పొందుతున్నారని తెలిపారు.మైనింగ్ 2-3 ఏళ్లలో మూతపడుతుందని ప్రచారం చేస్తూ, ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తున్నారని వాపోయారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి, ఖనిజ నిక్షేపాలపై నిజాయితీగా అధ్యయనం చేసి మైనింగ్‌ను కాపాడాలని డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా మట్టి పూడ్చిన అధికారులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో న్యాయస్థానాలను ఆశ్రయించడంతో పాటు ప్రాణాలైనా అడ్డుపెట్టి మైనింగ్‌ను కాపాడుకోవడానికి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

# దానాలు మనిషిలోని మానవత్వానికి ప్రతిరూపం

**● కరస్పాండెంట్ రవికుమార్ రెడ్డి,సేవాసమితి అధ్యక్షుడు రాజు**

**● జాతీయ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా న్యూ వికాస్ స్కూల్‌లో పోస్టర్ల ఆవిష్కరణ**






**పులివెందుల అర్బన్ మన జనప్రగతి ఆగస్టు 31:** నేత్రదానం,అవయవదానం, రక్తదానం వంటి మహోన్నత సేవా కార్యక్రమాలు మనిషిలోని మానవత్వానికి ప్రతిరూపాలని న్యూ వికాస్ హైస్కూల్ కరస్పాండెంట్ రవికుమార్ రెడ్డి పేర్కొన్నారు. జాతీయ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా కదిరి రోడ్డులోని న్యూ వికాస్ ఉన్నత పాఠశాలలో సోమవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా నేత్రదానం, అవయవదానం,రక్తదానం ప్రాముఖ్యతను వివరించే ప్రత్యేక పోస్టర్లను కరస్పాండెంట్ రవికుమార్ రెడ్డి,స్నేహిత అమృత హస్తం సేవాసమితి నేత్ర సేకరణ కేంద్రం అధ్యక్షులు రాజు విద్యార్థులతో కలిసి ఆవిష్కరించారు.ఒక వ్యక్తి మరణానంతరం చేసే నేత్రదానం ఇద్దరు అంధుల జీవితాల్లో వెలుగులు నింపుతుందని వక్తలు తెలిపారు.ప్రతి ఆరోగ్యవంతుడైన వ్యక్తి ఏడాదికి కనీసం రెండుసార్లు రక్తదానం చేయాలని, అవయవదానం ద్వారా ఎంతో మందికి పునర్జన్మ ప్రసాదించవచ్చని పిలుపునిచ్చారు.విద్యార్థులు సమాజంలో చైతన్య వారధులుగా మారి,తమ కుటుంబ సభ్యులు, బంధువులకు అవయవదానంపై అవగాహన కల్పించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు,విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని అవగాహన పోస్టర్లను ప్రదర్శించారు.నేత్రదానం,అవయవదానం వివరాల కోసం 9966509364 నంబరును సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

# ఘనంగా శ్రీ రాఘవేంద్ర స్వామి ఆరాధన ఉత్సవం



**కాకినాడ మన జనప్రగతి ఆగస్టు 31:-**శ్రీ గురు రాఘవేంద్ర స్వామి 355 ఆరాధన ఉత్సవాలు విశాఖపట్నం పేజావర్ అదోక్ష మత మధ్వ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 29 నుండి మూడు రోజులు పాటు ఘనంగా జరిగినవి. మధ్వ సంఘ కార్యదర్శి చిలుకూరి ముఖ్య ప్రాణారావు మత మేనేజర్ పండిత పవన్ ఆచార్ స్వీయ పర్యవేక్షణలో ఆరాధన ఉత్సవాలు ఘనంగా సోమవారంతో ముగిసాయి. ప్రధాన అర్చకులు ప్రసాద్ చే శ్రీ రాఘవేంద్ర స్వామి మృత్తిక బృందావనానికి విశేష పంచామృతాభిషేకాలతో పాటు అద్భుతమైన పుష్పాలంకరణ చేశారు. ఆరాధన సందర్భంగా శ్రీ రాఘవేంద్ర స్వామి రచించిన పరిమళ గ్రంధాన్ని పండిత పవనా చార్ పారాయణ చేశారు. మధ్వ సంఘ కార్యదర్శి చిలుకూరి ముఖ్య ప్రాణారావు, కమిటీ సభ్యులు కలిసి భక్తిశ్రద్ధలతో భక్తులకు ఏ విధమైన ఇబ్బందులు కలగకుండా ముందు జాగ్రత్త చర్యగా అనేక ఏర్పాటు చేశారు .మధ్య ఆరాధన సందర్భంగా ఆదివారం నాడు పలు ప్రాంతాల నుండి పండితులను ఆహ్వానించి గురువులకు సమర్పించిన నూతన వస్త్రాలతో అలంకార సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు .తొలి రోజున సాయంత్రం డాక్టర్ బైందూరి ఉత్సల కరెంత్ సంగీత కార్యక్రమం జరిగింది . శ్రీ రాఘవేంద్ర స్వామి మహిమలపై డాక్టర్ పరశు రామ్ ప్రసంగించారు. రెండవ రోజు తిరుమల తిరుపతి దేవస్థానం దాస సాహిత్య ప్రాజెక్ట్ కు చెందిన పరిమళ భజన మండలి ఆ కొండ వెంకట్రావు బృందం చే అద్భుతమైన దాసరి ,అన్నమయ్య పలువురి కీర్తనా ఆచార్యులకు చెందిన కీర్తనలు సుమారు మూడు గంటల పాటు అద్భుతంగా ఆలపించారు. ఈ కార్యక్రమంలో మధ్వ సంఘ కమిటీ సభ్యులు కోఠి నరసింహారావు, ఆర్మీ లక్ష్మణరావు మారేమండ సీతారామయ్య రాచూరిపార్థసారథి ,భాస్కరరావు, రమణారావు ,ఉలుగుండం రామకృష్ణ ,మోసలగంటి రాఘవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీ భవనం,విలేజ్ హెల్త్ క్లినిక్ ప్రారంభోత్సవం



**చిట్వేలి మన జనప్రగతి ఆగస్టు 31:-**చిట్వేలి మండలం సి.కందులవారిపల్లి గ్రామంలో ప్రజలకు అవసరమైన వైద్య, పరిపాలనా సేవలను మరింత చేరువ చేసే దిశగా రెండు కీలక భవనాలు అందుబాటులోకి వచ్చాయి. రూ.36 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్ భవనం, రూ.32 లక్షలతో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని బాలు రామాంజనేయులు ఆధ్వర్యంలో నిర్మించగా కస్తూరి విశ్వనాథ నాయుడు, రాష్ట్ర ఖాదీ గ్రామీణ పరిశ్రమల బోర్డు చైర్మన్ కే.కే. చౌదరి, పారిశ్రామికవేత్త విశ్వేశ్వర నాయుడు, కూటమి నాయకులతో కలిసి రైల్వే కోడూరు నియోజకవర్గం టిడిపి బాధ్యులు ముక్కా రూపానంద రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, ప్రభుత్వ సేవలు అందుబాటులో ఉండటం ఎంతో ముఖ్యమని అన్నారు. గ్రామంలోనే ప్రాథమిక వైద్య సేవలు లభించడం వల్ల చిన్నచిన్న అనారోగ్య సమస్యల కోసం ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గుతుందని తెలిపారు. విలేజ్ హెల్త్ క్లినిక్ ద్వారా గ్రామ ప్రజలకు ప్రాథమిక వైద్యం, ఆరోగ్య పరీక్షలు, వైద్య సలహాలు వంటి సేవలు అందుబాటులోకి వస్తాయని అన్నారు. ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. నూతన గ్రామ పంచాయతీ భవనం అందుబాటులోకి రావడం వల్ల గ్రామ పరిపాలన మరింత సౌకర్యవంతంగా కొనసాగుతుందని వారు అన్నారు. పంచాయతీ కార్యాలయం ప్రజలకు ప్రభుత్వ సేవలు, స్థానిక పరిపాలనకు సంబంధించిన కార్యక్రమాలు అందించే ప్రధాన కేంద్రంగా ఉంటుందని తెలిపారు. ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు, ప్రభుత్వ సేవలను పారదర్శకంగా అందించేందుకు పంచాయతీ వ్యవస్థ కీలకమని అన్నారు. ఈ కార్యక్రమంలో లారీ సుబ్బరాయుడు, చిట్వేలి మాజీ ఎంపీపీ గుండయ్య నాయుడు,చిట్వేలి మండల టిడిపి అధ్యక్షుడు కాకర్ల నాగార్జున, డాక్టర్ శివప్రసాద్ గౌడ్, కూటమి నాయకులు,కార్యకర్తలు, గ్రామ పెద్దలు, అధికారులు పాల్గొన్నారు.

# 78 వేల135 కోట్ల వ్యయంతో 36 నీటి ప్రాజెక్టుల నిర్మాణం గడువు లోగా పూర్తికి ప్రణాళిక

**● ప్రాజెక్టులపై వైసీపీకి కొరవడిన చిత్తశుద్ధి**

**● టీడీపీ ఎమ్మెల్యే, టీటీడీ సభ్యుడు నెహ్రూ**




**కాకినాడ మన జనప్రగతి ఆగస్టు 31:-**దేశంలో ఎల్నినో ప్రభావం చాలా తీవ్రంగా ఉందని అయినా రైతాంగానికి మేలు చేయాలని సంకల్పం కూటమి ప్రభుత్వానికి బలంగా ఉండడంతో వ్యవసాయానికి నీళ్లు అందించాలని సంకల్పంతో సుమారు 36 సాగునీటి ప్రాజెక్టులు నిర్మించి గడువులోగా పూర్తి చేయాలని ధ్యేయంతో ఉందని జగ్గంపేట ఎమ్మెల్యే,టీటీడీ సభ్యులు జ్యోతుల వెంకట అప్పారావు (నెహ్రూ) చెప్పారు. 1936 నుండి కడప ప్రకాశం జిల్లాలకు ఎంతో ఉపయోగపడే వెలుగొండ ప్రాజెక్టు మొదటి దఫా 6985 కోట్ల వ్యయంతో పూర్తిచేసి సోమవారం జాతికి అంకితం చేయడం, సెప్టెంబర్ రెండో తేదీన అనకాపల్లి వద్ద 1679 కోట్లతో పోలవరం లెఫ్ట్ మెయిన్ కెనాల్ పూర్తి చేసి జల హారతి ఇచ్చే కార్యక్రమం సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారన్నారు. ఈ విధంగా రాష్ట్రంలో 78 వేల135 కోట్ల 858 లక్షల వ్యయంతో సుమారు 36 ప్రాజెక్టులకు ప్రాధాన్యత క్రమంలో నిర్మాణం పూర్తి చేస్తామని నెహ్రూ చెప్పారు. సోమవారం కాకినాడలోని జిల్లా టీడీపీ కార్యాలయంలో నెహ్రూ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాస బాబాతో కలిసి విలేకరులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా నెహ్రూ మాట్లాడుతూ 1996లో వెలిగొండ ప్రాజెక్టుకు సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేశారని తర్వాత వచ్చిన ప్రభుత్వాలు అంతగా పట్టించుకోకపోవడం ఒక పోవడంతో అది పూర్తి కాలేదన్నారు ఆ వెలుగొండను వైయస్ దాన యజ్ఞంగా మార్చి కోట్లాది రూపాయలను దోచుకున్నారని చెప్పారు తర్వాత టీడీపీ కూటమి ప్రభుత్వంలో దీనిని ఫేస్ వన్లో పూర్తి చేసామని చెప్పారు. మాజీ సీఎం జగన్ వెలుగొండను తన తండ్రి పూర్తి చేశారని చంద్రబాబు చేసింది ఏమీ లేదంటూ చెప్పడంను ఆయన తప్పు పట్టారు. ఇంకా వరుసగా 30వేల 436 కోట్ల వ్యయంతో పోలవరం ప్రాజెక్టును మార్చి 2027లోగా,కాటన్ బ్యారేజీ గేట్లకు 152 కోట్ల రూపాయల వ్యయంతో జూన్ 2027 నాటికి, గోదావరి డెల్టా వ్యవస్థ ఆధునీకరణకు 3 వేల కోట్లతో జూన్ 2028 నాటికి, బుడమేరు యూటీ నిర్మాణానికి 76 కోట్లతో జూన్ 2027 నాటికి, చింతలపూడి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం ఫేస్ వన్ 8075 కోట్లతో జులై 22 నాటికి పూర్తి చేస్తామని చెప్పారు ఈ విధంగా తాము వరుస క్రమంలో ప్రాజెక్టులు నిర్మాణానికి రూపకల్పన చేసామని చెప్పారు. ప్రాజెక్టుల నిర్మాణం వల్ల పారిశ్రామిక రంగం అభివృద్ధి చెంది ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని నెహ్రూ చెప్పారు.అతి క్లిష్టతరమైన చోట్ల పనులను చంద్రబాబు ప్రభుత్వంలోనే చేశామని జగన్ కేవలం తక్కువ ఖర్చు ఆదాయం అధికంగా వచ్చే వాటిచోట్లనే పనులను నిర్వహించి దోపిడీకి పాల్పడ్డారని నెహ్రూ అన్నారు.

### ఆకలితో ఉన్నవారికి అన్నం అందించడమే

# నిజమైన సేవ:రాంప్రసాద్ రెడ్డి



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి ఆగస్టు 31:-** మానవ సేవే మాధవ సేవ' అనే ఆశయంతో గత ఐదేళ్లుగా శివోహం సంస్థ ద్వారా వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని శివోహం అన్నప్రసాద సేవా సంస్థ అధ్యక్షులు శెట్టిపల్లె రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. హనుమత్ లింగేశ్వర స్వామి ఆలయంలో శెట్టిపల్లె రాంప్రసాద్ రెడ్డి దంపతులు, వారి మనవరాళ్లు శెట్టిపల్లె స్పందన సమన్వి రెడ్డి, సుబ్బారెడ్డిగారి నిర్విక రెడ్డి, కుటుంబ సభ్యుల సౌజన్యంతో అన్నాభిషేకం, అన్నప్రసాద సేవ నిర్వహించారు. మాజీ మంత్రి పి. రామమునిరెడ్డి హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ఆకలితో ఉన్నవారికి అన్నం అందించడం అత్యంత గొప్ప సేవ అని పేర్కొన్నారు. ఇదే లక్ష్యంతో తమ కుటుంబ సభ్యుల సహకారంతో అన్నప్రసాద సేవను నిరంతరం కొనసాగిస్తున్నామని తెలిపారు. సమాజంలో సేవా భావాన్ని పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మురుకూటి సూర్యనారాయణ రెడ్డి, విష్ణు నారాయణ, కొవ్వూరు రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# హాస్టల్ భవనాలు అప్పగించాలని పీజీఆర్ఎస్‌లో విద్యార్థుల ఫిర్యాదు



**అన్నమయ్య జిల్లా బ్యూరో మన జనప్రగతి ఆగస్టు 31:-** రాయచోటి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు తమ హాస్టల్ భవనాలను తిరిగి అప్పగించాలని కోరుతూ సోమవారం పిజిఆర్ఎస్ లో ఆర్డీవో శ్రీనివాసులకు ఫిర్యాదు చేశారు.అఖిల భారత స్టూడెంట్స్ పవర్ అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్ కుమార్ నేతృత్వంలో విద్యార్థులు ఈ ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం 250 మంది విద్యార్థులకు హాస్టల్ వసతి లేక ఇబ్బందులు పడుతున్నారని, ప్రైవేట్ హాస్టళ్లకు అధిక మొత్తంలో చెల్లించాల్సి వస్తోందని తెలిపారు. తక్షణం హాస్టల్ భవనాలను విద్యార్థులకు అప్పగించాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని కిరణ్ కుమార్ హెచ్చరించారు.

# దళితుల సంక్షేమం కోసం చిత్తశుద్ధితో పనిచేస్తా..!

**- జిల్లా దళిత అభివృద్ధి సంక్షేమ సేవా సంఘం నగర అధ్యక్షుడు బాలే వినయ్ కుమార్**



**కడప మన జనప్రగతి ఆగస్టు 31:-** జిల్లా దళిత అభివృద్ధి సంక్షేమ సేవా సంఘం కడప నగర అధ్యక్షుడిగా బాలే వినయ్ కుమార్ ను సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు ఆర్.వి. శంకర్ నియమించారు. తనపై నమ్మకముతో నగర అధ్యక్షులుగా నియమించినందుకు వ్యవస్థాపక అధ్యక్షులు ఆర్ వి.శంకర్ కు బాలే వినయ్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.సోమవారంఈ సందర్భంగా బాలే వినయ్ కుమార్ మాట్లాడుతూ, "నాకు అప్పగించిన బాధ్యతను ఎంతో గౌరవంగా స్వీకరిస్తున్నాను. సంఘం విధివిధానాలకు అనుగుణంగా పనిచేస్తూ దళిత వర్గాలకు అందాల్సిన హక్కులు, సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సహాయాన్ని వారికి చేరేలా నా వంతు కృషి చేస్తాను" అని తెలిపారు.సంఘం కార్యకలాపాలను నగరంలోని అన్ని ప్రాంతాలకు విస్తరించి,దళిత వర్గాల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ప్రజల నుంచి వచ్చే సమస్యలను సంబంధిత నాయకుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, సంఘం తరఫున చేపట్టే ప్రతి కార్యక్రమాన్ని సమన్వయంతో నిర్వహిస్తానని చెప్పారు.సంఘం రాష్ట్ర, జిల్లా నాయకత్వం సూచనలు, విధివిధానాలను పాటిస్తూ ముందుకు సాగుతానన్నారు.అలాగే సంఘం నాయకులు, కార్యకర్తల సహకారంతో బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని ఆయన తెలిపారు.

## ఎస్పీ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 71 ఫిర్యాదులు



**మదనపల్లె మన జనప్రగతి ఆగస్టు 31:**-మదనపల్లె జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా ఎస్పీ ధీరజ్ ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా మొత్తం 71 ఫిర్యాదులు అందాయి.వాటిలో 30 భూ వివాదాలు, 10 ఆర్థిక వివాదాలు, 10 ఘర్షణలు, న్యూసెన్స్‌కు సంబంధించిన ఫిర్యాదులు ఉన్నాయి. అలాగే మోసం, సైబర్ నేరాలకు సంబంధించి 7, కుటుంబ వివాదాలపై 6, ఇతర సమస్యలకు 5, పరిపాలనకు సంబంధించిన 3 ఫిర్యాదులు అందాయి.ప్రజలు సమర్పించిన ఫిర్యాదులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిష్కరించాలని ఎస్పీ ధీరజ్ ఆదేశించారు. ముఖ్యంగా భూకబ్జాలు, వడ్డీ వేధింపులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఫిర్యాదుదారుల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా, బాధ్యతాయుతంగా వ్యవహరించి సత్వర పరిష్కారం చూపాలని స్పష్టం చేశారు.

## 125 రోజుల ఉపాధి పనిని సద్వినియోగం చేసుకోవాలి: ఏపీవో పెంచలయ్య



**రామాపురం మన జనప్రగతి ఆగస్టు 31:**-ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు నెలకొనే అవకాశం ఉన్న నేపథ్యంలో మండలంలోని ఉపాధి హామీ కూలీలు 125 రోజుల పనిదినాలను సద్వినియోగం చేసుకోవాలని ఏపీవో పెంచలయ్య సూచించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ విషయాన్ని తెలిపారు.ఈ సందర్భంగా ఏపీవో పెంచలయ్య మాట్లాడుతూ...వి.బి.జి.రాం.జీ పథకంలో కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అర్హులైన ప్రతి ఉపాధి కూలీలకు పనులు కల్పించడంతో పాటు, కరువు సమయంలో వారికి ఆర్థికంగా భరోసా కల్పించేందుకు ఉపాధి హామీ పథకం ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు. కూలీలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏపీవో పెంచలయ్య కోరారు.

## స్థానిక,మున్సిపల్ ఎన్నికల్లో వైకాపా జెండా ఎగరేయాలి

- ఎంపీ అవినాష్ రెడ్డి
- విజయానికి సమిష్టిగా కృషి చేద్దాం
- పులివెందులలో ప్రజాదర్బార్ నిర్వహణ



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి ఆగస్టు 31:** రానున్న స్థానిక సంస్థలు, మున్సిపల్ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేయడమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పనిచేయాలని కడప ఎంపీ వై.ఎస్.అవినాష్ రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం పులివెందులలోని తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఆయన పాల్గొన్నారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలు, వినతులను స్వీకరించి, సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు.ఈ సందర్భంగా ఎంపీ అవినాష్ రెడ్డి మాట్లాడుతూఈ నెల 2వ తేదీన కడప జిల్లాలో వైకాపా అధినేత వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి చేపట్టనున్న పర్యటనను విజయవంతం చేయడానికి పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి,సంక్షేమ పథకాల అమలులో ప్రజలకు వెన్నుపోటు పొడుస్తోందని విమర్శించారు.ప్రభుత్వ వైఫల్యాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లి ప్రజలను చైతన్యపరచాలన్నారు.పార్టీ కేడర్ అంతా కలిసికట్టుగా కృషి చేసి రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో పలువురు వైకాపా ముఖ్య నేతలు,కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఆహార సాంకేతిక కళాశాలను సందర్శించిన జంతుశాస్త్ర విద్యార్థినులు



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి ఆగస్టు 31:**- స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల జంతుశాస్త్ర విద్యార్థినులు సోమవారం పులివెందులలోని ఆహార సాంకేతిక విజ్ఞాన కళాశాల (కాలేజ్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ)ని క్షేత్రస్థాయి అధ్యయనంలో భాగంగా సందర్శించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శ్రీనివాసులు అనుమతితో వైస్ ప్రిన్సిపాల్ మరియు జంతుశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ యు.శ్రీనిత,సి.వినోద,డి.ప్రవళికల ఆధ్వర్యంలో ఈ విద్యా పర్యటన జరిగింది.ఈ సందర్భంగా విద్యార్థినులు కళాశాలలోని లైవ్లీహుడ్ బిజినెస్ ఇంక్యుబేటర్,సోలార్ కోల్డ్ రూమ్‌తో పాటు ఫుడ్ ఇంజనీరింగ్,ఫుడ్ టెక్నాలజీ,ఫుడ్ కెమిస్ట్రీ,ఫుడ్ మైక్రోబయాలజీ విభాగాల్లోని అత్యాధునిక ప్రయోగశాలలను పరిశీలించారు.ఆయా విభాగాల పనితీరు,ఆహార భద్రత,ప్రాసెసింగ్ సాంకేతికతలపై కళాశాల అధ్యాపకులు డాక్టర్ ఎం.సాయి శ్రీనివాస్,డాక్టర్ జాకీర్ బాషా,డాక్టర్ జయమ్మలు విద్యార్థినులకు సోదాహరణంగా వివరించారు.విద్యార్థినుల అధ్యయన సందర్శనకు అనుమతి కల్పించిన ఆహార సాంకేతిక కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.మాధవకు మహిళా డిగ్రీ కళాశాల అధ్యాపక బృందం ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసింది.ఇలాంటి ప్రత్యక్ష క్షేత్ర పర్యటనల ద్వారా ఆహార సాంకేతికత మరియు ప్రయోగశాలల నిర్వహణపై సమగ్ర అవగాహన,సరికొత్త పరిజ్ఞానం లభించిందని విద్యార్థినులు సంతోషం వ్యక్తం చేశారు.

## పీజీఆర్ఎస్‌లో 316 అర్జీలు.. సకాలంలో పరిష్కరించాలి

**- అధికారులకు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదేశం**



**మదనపల్లి మన జనప్రగతి ఆగస్టు 31:**-ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను నిర్లక్ష్యం చేయకుండా నిర్ణీత గడువులోపు నాణ్యతతో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్)పై నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తూ, ఎలాంటి అర్జీలు పెండింగ్‌లో లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన వినతులను కలెక్టర్ స్వీకరించారు. అంగళ్ల ప్రాంతంలో తాగునీటి సమస్య, రేషన్ షాపు ఏర్పాటు, భూ వివాదాలు తదితర అంశాలపై బాధితులు వినతిపత్రాలు సమర్పించారు. మొత్తం 316 అర్జీలు అందగా, వాటిని పరిష్కారం కోసం సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఐవీఆర్ఎస్ ద్వారా ప్రజల నుంచి వచ్చే అభిప్రాయాల ఆధారంగా జిల్లాను మెరుగైన స్థానంలో నిలపాలని పేర్కొన్నారు. ప్రతి శాఖ అధికారి తమ శాఖ పనితీరును నిరంతరం సమీక్షించుకుంటూ సేవల నాణ్యతను పెంపొందించాలని ఆదేశించారు.పీజీఆర్ఎస్‌తో పాటు రెవెన్యూ క్లినిక్‌కు సంబంధించిన అర్జీల పరిష్కారంలో కూడా ఎలాంటి అలసత్వం ప్రదర్శించరాదని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజలకు త్వరితగతిన, పారదర్శకంగా సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

## వాల్మీకి ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలి..యువ నాయకులు

**- బడిగే వన్నురుస్వామి,హరేసముద్రం రాము,దివాకర్,రామస్వామి**



**బొమ్మనహాల్ మన జనప్రగతి ఆగస్టు 31:**-మండలంలోని దర్గా హోన్నూరు గ్రామంలో మహర్షి వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు సోమవారం వైభవంగా నిర్వహించారు,వేకువజాము నుంచే గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది,హోమాలు, యాగాలు నిర్వహించి వాల్మీకి మహర్షికి ప్రత్యేక పూజలు చేశారు,అనంతరం పూజతో అలంకరించిన విగ్రహాన్ని గ్రామ పురవీధుల్లో డీజే పాటల నడుమ ఘనంగా ఊరేగించారు. యువత పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో ఊరేగింపు సందడిగా సాగింది,మహిళలు, గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో కార్యక్రమంలో పాల్గొన్నారు, దీంతో దర్గా హోన్నూరు గ్రామం మొత్తం పండగ వాతావరణాన్ని సంతరించుకుంది,ఈ సందర్భంగా యువ నాయకులు బడిగే వన్నూరుస్వామి, హరేసముద్రం రాము,వాల్మీకి దివాకర్,వాల్మీకి రామస్వామి మాట్లాడుతూ..మహర్షి వాల్మీకి ఆశయాలను,ఆయన అందించిన సందేశాన్ని భావితరాలకు అందించాలనే ఉద్దేశంతో విగ్రహ ప్రతిష్ఠాపన చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు,భక్తుల కోసం కమిటీ సభ్యులు అన్నసత్రం ఏర్పాటు చేసి అన్నప్రసాదం అందించారు, ఈ కార్యక్రమంలో మండల వాల్మీకి సోదరులు పెద్దా ఎత్తున పాల్గొన్నారు.

## దేవగిరిలో దోమల నివారణకు అబేట్ మందు పిచికారి



**బొమ్మనహాళ్ మన జనప్రగతి ఆగస్టు 31:**-మండల పరిధిలో దేవగిరి గ్రామంలోని మురికినీటి కాలువల్లో దోమల నివారణకు ముందస్తు చర్యల్లో భాగంగా అబేట్ మందును పిచికారి చేశారు,గ్రామ ప్రజల భాగస్వామ్యంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు,ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని, దోమతెరలు వినియోగించాలని, పరిసరాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని సూచించారు,దోమకాటు ద్వారా వచ్చే విషజ్వరాల నుంచి రక్షణ పొందేందుకు జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని వివరించారు.ఈ కార్యక్రమంలో సెక్రటరీ రాధాకృష్ణ,ఆరోగ్య కార్యకర్త గోవర్ధన్,ఆశా కార్యకర్తలు శ్రావణి,లక్ష్మిదేవి పాల్గొన్నారు.

## మహిళలు, బాలల రక్షణపై విద్యార్థులకు పోలీసుల అవగాహన



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి ఆగస్టు 31:**-మహిళలు,బాలలపై జరిగే నేరాల నివారణకు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా ప్రొద్దుటూరులోని ఎస్‌సీఎన్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మహిళలు, బాలలపై జరిగే నేరాల నివారణ అంశంపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు.కడప జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు, ప్రొద్దుటూరు ఏఎస్పీ విభూకృష్ణ ఐపీఎస్ పర్యవేక్షణలో ప్రొద్దుటూరు వన్‌టౌన్ పోలీసులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రొద్దుటూరు వన్‌టౌన్ యూజీ పోలీస్ స్టేషన్ సీఐ టీవీ కొండారెడ్డి మాట్లాడుతూ మహిళలు, బాలికలు తమకు ఎదురయ్యే సమస్యలు, వేధింపుల విషయంలో భయపడకుండా పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీసుల సహాయం పొందాలని తెలిపారు. మహిళలు, బాలలపై జరిగే నేరాలు, వేధింపులు, బాల్య వివాహాలు, సైబర్ నేరాలు తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మహిళలు, బాలల రక్షణ కోసం ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ అందిస్తున్న సేవలు, శక్తి టీమ్ వంటి ప్రత్యేక విభాగాల సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో హెచ్‌సీ 431 జి. రాంబాబు, డబ్ల్యూపీసీ 2150 ఎస్. సరోజ, డబ్ల్యూపీసీ 2170 బి. శివలక్ష్మి, కడప మహిళా పోలీస్ స్టేషన్ హెచ్‌సీ 389 కె. నాగేష్ కుమార్, ప్రొద్దుటూరు శక్తి టీమ్ పీసీ 2551 డి. రాజేంద్ర పాల్గొన్నారు.కళాశాల ప్రిన్సిపాల్ ఎం. చంద్ర ఓబుల్ రెడ్డి, ఇంగ్లీష్ లెక్చరర్ వీవీఎన్ కిషోర్ పాల్గొని పోలీస్ శాఖ నిర్వహిస్తున్న అవగాహనా కార్యక్రమాలను అభినందించారు.మహిళలు, బాలల భద్రతపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించడంతో పాటు, నేరాల నివారణలో ప్రజలు పోలీసులకు సహకరించాల్సిన అవసరాన్ని ఈ కార్యక్రమం ద్వారా వివరించారు.

## టీడీపీ నాయకుల జోలికొస్తే తీవ్రంగా ప్రతిఘటిస్తాం: జీవీ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి హెచ్చరిక



**ప్రొద్దుటూరు మన జనప్రగతి ఆగస్టు 31:**-టీడీపీ నాయకులు, కార్యకర్తల జోలికి వస్తే తీవ్రంగా ప్రతిఘటిస్తామని టీడీపీ నాయకుడు జీవీ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. సోమవారం తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.టీడీపీ నాయకుల నాలుక కోస్తానంటూ మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ధైర్యం ఉంటే నేరుగా వచ్చి మాట్లాడాలని సవాల్ విసిరారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు చల్లా రాజగోపాల్ యాదవ్ ప్రజా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు.బీసీ వర్గాలకు చెందిన నాయకులు ఎదగడాన్ని రాచమల్లు ఓర్చుకోలేకపోతున్నారని విమర్శించారు. ప్రొద్దుటూరు అభివృద్ధిపై దృష్టి పెట్టాలని సూచించారు. పట్టణ వ్యాపారులకు టీడీపీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.రాచమల్లు ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో జరిగినట్లు తాను ఆరోపిస్తున్న అక్రమాలు, అవినీతిపై ప్రజలకు వివరిస్తున్నానని పేర్కొన్నారు. గతంలో రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద తన ఆస్తుల విలువ రూ.100 కోట్లుగా వెల్లడించిన విషయంపై నాడు, నేడు ఉన్న ఆస్తుల వివరాలకు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.రాచమల్లు వ్యాఖ్యలు భవిష్యత్తులో ప్రొద్దుటూరులో ఫ్యాక్షన్ రాజకీయాలకు దారితీసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలపై చేసిన వ్యాఖ్యలను బేషరతుగా వెనక్కి తీసుకోవాలని ప్రవీణ్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు.

## శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధికి రూ.50 వేల విరాళం



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి ఆగస్టు 31:**పులివెందుల పట్టణంలోని అహోబిలాపురం వాసవీ కాలనీలో వెలసిన శ్రీ శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం అభివృద్ధికి విశ్రాంతి ఆర్టీసీ ఉద్యోగి వెన్నపూస రామిరెడ్డి రూ. 50 వేల విరాళాన్ని అందజేశారు.సోమవారం ఆలయ కమిటీ సభ్యులు మిట్టా శ్రీహరికి ఈ మొత్తాన్ని ఆయన అందించారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వెన్నపూస రామిరెడ్డిని దుశ్శాలువా, పూలమాలతో సత్కరించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ, ఆలయ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందించడం సంతోషంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## వీరాంజనేయుని చెంతకు పాదయాత్ర తేలూరు తుమ్మలపల్లి గ్రామ ప్రజలు

తొండూరు మన జన ప్రగతి ఆగష్టు 31:-మండల పరిధిలోని టీ.తుమ్మలపల్లె గ్రామ ప్రజలు వరుణుడు కరుణించాలని...పంటలు సస్యశ్యామలం కావాలని ప్రజలు గండి వీరాంజనేయస్వామి వారికి పూజలు నిర్వహించుకునేందుకు కాలినడకన బయలుదేరడం జరిగింది.ఎల్ నినో ప్రభావంతో వర్షాలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వర్షాలు కురవలేదని వరుణదేవుడు కరుణించలేదని  శ్రావణ మాసం సందర్భంగా సోమవారం సాయంత్రం గ్రామస్తులు పెద్ద ఎత్తున గండి క్షేత్రానికి పాదయాత్రగా బయలుదేరారు.వర్షాలు సమృద్ధిగా కురవాలని,రైతులు సుఖసంతోషాలతో ఉండాలని,పాడి పంటలతో గ్రామం సుభిక్షంగా ఉండాలని గండి ఆంజనేయస్వామిని వేడుకునేందుకే పాదయాత్ర చేస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. భక్తి శ్రద్ధలతో,భజనలతో గ్రామస్తులు పాదయాత్రను కొనసాగించారు .



# గ్యాస్ సేఫ్టీ చెక్ పేరుతో వసూళ్లు

**• నిలదీసిన ప్రజలు,వెనక్కి తగ్గిన ఏజెన్సీ సిబ్బంది!**





**పులివెందుల అర్బన్ మన జనప్రగతి ఆగస్టు 31:** పులివెందుల పట్టణ పరిధిలోని నగిరిగుట్టలో గ్యాస్ సేఫ్టీ చెక్ పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న గ్యాస్ ఏజెన్సీ సిబ్బందిని స్థానిక ప్రజలు నిలదీశారు.ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో వసూలు చేసిన మొత్తాన్ని సిబ్బంది తిరిగి చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది.వివరాల్లోకి వెళితేపులివెందులకు చెందిన హరిప్రియ హెచ్.పీ గ్యాస్ ఏజెన్సీ సిబ్బందిమంటూ కొందరు వ్యక్తులు నిబంధనల మేరకు తప్పనిసరిగా 'సేఫ్టీ చెక్' చేయించుకోవాలని వినియోగదారుల నుంచి అధిక మొత్తంలో నగదు వసూలు చేయడం ప్రారంభించారు.సోమవారం నగిరిగుట్ట ప్రాంతంలో ఈ తరహా వసూళ్లకు పాల్పడుతుండగా స్థానికులు వారిని గట్టిగా ప్రశ్నించారు.వచ్చిన సిబ్బంది వద్ద కనీసం వినియోగదారుల ప్రాథమిక వివరాలు కూడా లేకపోవడం, అడిగిన ప్రశ్నలకు పొంతనలేని సమాధానాలు చెప్పడంతో స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రజల నుంచి ఒత్తిడి పెరగడంతో వసూలు చేసిన మొత్తాన్ని సిబ్బంది వెంటనే బాధితులకు తిరిగి ఇచ్చేశారు.కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం గ్యాస్ భద్రతా తనిఖీలపై స్పష్టమైన విధివిధానాలు ఉన్నప్పటికీ,కొన్ని ఏజెన్సీలు వినియోగదారుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి సేఫ్టీ చెక్ నిబంధనలపై ప్రజలకు స్పష్టమైన అవగాహన కల్పించాలని అనధికార వసూళ్లను అరికట్టాలని కోరుతున్నారు.

# ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డిని కలిసిన మైనార్టీ నేతలు

**- పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన మైనార్టీ నేతలు**



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి ఆగస్టు 31:**జిల్లా ఎంపీ అవినాష్ రెడ్డిని పులివెందుల మైనార్టీ సోదరులు మర్యాదగాపూర్వకంగా కలిసి ఆశీస్సులు అందించారు. వివరాలలోకి వెళితే ఇటీవల 42వ పుట్టినరోజును పురస్కరించుకొని నూరుల్లా ఆధ్వర్యంలోని మైనారిటీ నేతలు సోమవారం ఎంపీ అవినాష్ రెడ్డిని కలిసి శుభాకాంక్షలు మరియు ఆశీస్సులు అందజేసి వివిధ రాజకీయ ప్రాధాన్యత అంశాలను,వైకాపా అధినేత జగన్మోహన్ రెడ్డి పులివెందుల పర్యటన మరియు అదే విధంగా రానున్న స్థానిక మరియు మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి అనుసరించవలసినటువంటి వ్యూహాత్మక విషయాలను చర్చించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర నూర్ భాషా సంఘం అధ్యక్షులు రసూల్,జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ నూరుల్లా,పట్టణ మైనార్టీ అధ్యక్షులు షబ్బీర్, మహబూబ్ బాషా,తదితర వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

# తాగునీటి సమస్య పరిష్కారానికి సత్వర చర్యలు

**• డిప్యూటీ ఎంపీడీవో రమణయ్య**



**వేంపల్లె మన జనప్రగతి ఆగస్టు 31:**-వేంపల్లి మేజర్ పంచాయతీ పరిధిలోని ఫక్కిరుపల్లెలో ఉన్న తాగునీటి సమస్య పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటామని డిప్యూటీ ఎంపీడీవో రమణయ్య అన్నారు. పక్కిరు పల్లె గ్రామంలో 300 పేద కుటుంబాలు నివసిస్తున్నాయి. గ్రామంలో ఉన్న తాగునీటి పథకానికి సంబంధించిన మోటారు 20 రోజుల క్రితం చెడిపోయింది. దీంతో కాలనీ వాసులకు గుక్కెడు తాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై ఆ ప్రాంత ఎంపీటీసీ సభ్యుడు, వైకాపా విద్యార్థి విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు పఠాన్ రహమతుల్లా ఖాన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు స్పందించిన డిప్యూటీ ఎంపీడీవో రమణయ్య సోమవారం ఆ ప్రాంతానికి వెళ్లి తాగునీటి పథకాన్ని పరిశీలించారు. త్వరలోనే సిబ్బందిని పంపించి ఈ తాగునీటి పథకం మోటార్ను రిపేరు చేయించి గ్రామస్తులకు తాగునీరు అందేలా చూస్తానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# కాంట్రాక్టు ఉద్యోగుల హక్కుల కోసం ఐక్య పోరాటాలు తప్పవు

**• వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది సంతకాల సేకరణ**

**వేంపల్లె మన జనప్రగతి ఆగస్టు 31:**-ప్రభుత్వ ఆసుపత్రుల కాంట్రాక్టు ఉద్యోగుల హక్కుల కోసం ఐక్య పోరాటాలు తప్పవని వేంపల్లి వైద్య విధాన పరిషత్ ఆసుపత్రి కాంట్రాక్టు ఉద్యోగుల సంఘ ప్రతినిధులు స్పష్టం చేశారు. తమ న్యాయమైన డిమాండ్ల కోసం సోమవారం వారు ఆసుపత్రిలో నల్ల బ్యాడ్జీలు ధరించి సంతకాల ఉద్యమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలన్నారు. వారికి 100 శాతం గ్రాస్ శాలరీ ఇవ్వాలని కోరారు. విధుల్లో ఉన్నప్పుడు ఉద్యోగి మరణిస్తే ఎక్స్గ్రేషియా తో పాటు తగిన ఆర్థిక సాయం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు రాము నాయక్,సుజిత, రమణమ్మ, నిర్మల, సంధ్య తదితరులు పాల్గొన్నారు.



# లెమర్ స్కూల్‌లో రంగురంగుల ఓణం వేడుకలు







**కల్లూరు, మన జనప్రగతి ఆగస్టు 31:** లెమర్ ఎడ్యుకేషనల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలోని సెయింట్ మైఖేల్స్ హై స్కూల్ లో ఓణం వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణం కేరళ సంప్రదాయ సంస్కృతిని ప్రతిబింబించేలా సందడిగా మారింది. విద్యార్థులు, ఉపాధ్యాయులు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని ఓణం పండుగ విశిష్టతను చాటిచెప్పారు. విద్యార్థులు రూపొందించిన ఆకర్షణీయమైన పూల అలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సంప్రదాయ నృత్యాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థులు అందరినీ అలరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు అబ్బాస్ హసన్ మాట్లాడుతూ, ఓణం పండుగ కేరళ సంస్కృతి, సంప్రదాయాలు, ఐక్యత, సోదరభావానికి ప్రతీక అని అన్నారు. ఇటువంటి సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో భారతీయ సంప్రదాయాలు, విభిన్న సంస్కృతుల పట్ల అవగాహనతో పాటు గౌరవభావం పెరుగుతుందని పేర్కొన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరి జీవితాల్లో ఓణం పండుగ ఆనందం, శాంతి, ఐక్యత, సంతోషాన్ని నింపాలని పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆకాంక్షిస్తూ అందరికీ ఓణం శుభాకాంక్షలు తెలిపారు.

# బిజెపి రాష్ట్ర కార్యాలయంపై కాంగ్రెస్ దాడి అప్రజాస్వామికం

**అధికారాన్ని అడ్డుపెట్టుకొని దాడులు చేయడం కాంగ్రెస్ విష సాంస్కృతికి నిదర్శనం : కత్తి హరీష్ గౌడ్**



**మల్లంపల్లి మన జనప్రగతి ఆగస్టు 31:** నిత్యం ప్రజాస్వామ్యం రాజ్యాంగం ప్రజల హక్కుల గురించి నీతులు చెప్పే కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో అధికారాన్ని అడ్డుపెట్టుకొని రాజకీయ ప్రత్యర్థులపై దాడులకు పాల్పడడం ఎంతవరకు సమంజసం అని బిజెపి సీనియర్ నాయకుడు కత్తి హరీష్ గౌడ్ ప్రశ్నించారు భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యాలయం పై కాంగ్రెస్ శ్రేణులు చేసిన అప్ర ప్రజాస్వామిక దాడిని తీవ్రంగా ఖండించారు. బిజెపిని రాజకీయంగా ఎదుర్కోలేక కాంగ్రెస్ పార్టీ అల్లరి మూకలను ప్రోత్సహిస్తూ రాజకీయ పార్టీ కార్యాలయంపై దాడులు చేయించే స్థాయికి దిగజారిందని హరీష్ గౌడ్ విమర్శించారు. ప్రజాస్వామ్యంలో రాజకీయ పార్టీలకు తమ భావాలను వ్యక్తం చేసే హక్కు ఉందని అయితే ప్రత్యర్థి పార్టీ కార్యాలయాలపై దాడులు చేయడం ఆస్తులను ధ్వంసం చేయడం వంటి చర్యలు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్నారు దేశవ్యాప్తంగా రాజ్యాంగం ప్రజాస్వామ్య హక్కుల గురించి మాట్లాడే కాంగ్రెస్ అభ్యత రాహుల్ గాంధీ తెలంగాణలో కాంగ్రెస్ శ్రేణులు చేస్తున్న దాడులను ఖండించే దమ్ము ఉందా అని కత్తి హరీష్ గౌడ్ ప్రశ్నించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటూ ఉపన్యాసాలు ఇవ్వడం కాకుండా తమ పార్టీ కార్యకర్తలు చట్టాన్ని చేతులకు తీసుకుంటే వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బిజెపి రాష్ట్ర కార్యాలయ గేట్లపై నల్ల రంగు పూయడం కాంగ్రెస్ పార్టీ ఎమర్జెన్సీ మనస్తత్వానికి నిదర్శనమని ఆయన ఆరోపించారు ప్రజలు ఇచ్చిన అధికారాన్ని సంక్షేమం అభివృద్ధి కోసం వినియోగించాల్సిన ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమై రాజకీయ ప్రత్యర్థులపై దాడులకు దాడులకు పాల్పడటం సరికాదన్నారు. బిజెపి కార్యకర్తల సహనాన్ని పరీక్షించవద్దు బిజెపి కార్యకర్తలు ఇప్పటివరకు సంయమనంతో నివసిస్తున్నారని తమ సహనాన్ని బలహీనతగా భావించొద్దని హరీష్ గౌడ్ హెచ్చరించారు. బిజెపి కార్యకర్తలు కూడా ఎదురు దాడులకు దిగితే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలు కూడా మిగలవని తీవ్ర వ్యాఖ్యలు చేశారు అయితే రాజకీయ పోరాటం ప్రజాస్వామ్య పద్ధతుల్లోని జరగాలని దాడులు హింసకు తావివ్వకూడదని ఆయన స్పష్టం చేశారు. అధికారాన్ని అడ్డుపెట్టుకొని ప్రతిపక్షాల గొంతు నొక్కే ప్రయత్నం చేస్తే ప్రజలు తగిన సమాధానం చెబుతారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంపై దృష్టి పెట్టాలని రాజకీయ కక్ష సాధింపులు దాడుల సంస్కృతిని విడనాడాలని కత్తి హరీష్ గౌడ్ డిమాండ్ చేశారు

# కరీంనగర్ త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో సీపీ గౌష్ ఆలం ఆకస్మిక తనిఖీ.







**కరీంనగర్ టౌన్ మన జనప్రగతి ఆగస్టు 31:**కరీంనగర్ త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌ను సోమవారం పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించిన ఆయన, వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ సిబ్బందితో మాట్లాడిన సీపీ.. వారికి కేటాయించిన విధులు, నిర్వహిస్తున్న బాధ్యతలపై ఆరా తీశారు. పోలీస్ స్టేషన్ రికార్డులను క్రమబద్ధంగా నిర్వహించాలని, నమోదైన కేసుల వివరాలను ఎప్పటికప్పుడు జజుబీలో నమోదు చేయాలని ఆదేశించారు.తెలంగాణ పోలీస్ శాఖ అందుబాటులోకి తెచ్చిన జజుబీ-2.0, పిటిషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, ఈ-సమన్లు, TS`COP, HRMS, e`Saakshya, TechDatum, iRAD, <ŠsÂÎDY, CEIR, సైబర్ క్రైమ్ సాఫ్ట్‌వేర్, CDR తదితర సాంకేతిక అప్లికేషన్లపై సిబ్బంది పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. రోజువారీ విధుల్లో టెక్నాలజీని విస్తృతంగా వినియోగించి పోలీసింగ్‌ను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని పేర్కొన్నారు. అనంతరం ఎఫ్ఐఆర్ ఇండెక్స్, పెండింగ్ కేసుల వివరాలను పరిశీలించిన కమిషనర్.. కేసులు పెండింగ్‌లో ఉండటానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. దర్యాప్తులను వేగవంతం చేసి కేసులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, నేరాల నియంత్రణకు విజిబుల్ పోలీసింగ్ను పటిష్టంగా అమలు చేయాలని సూచించారు.త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిని సెక్టార్లు, సబ్-సెక్టార్లుగా విభజించి, ఆయా ప్రాంతాలకు విలేజ్/ఏరియా పోలీస్ ఆఫీసర్లను కేటాయించి ప్రజలకు పోలీసుల అందుబాటును మరింత పెంచాలని ఆదేశించారు.అదేవిధంగా రౌడీషీటర్లు, హిస్టరీషీటర్లపై నిరంతరం నిఘా ఉంచాలని, వారి కదలికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రతి నెలా తాజా సమాచారాన్ని రికార్డుల్లో నమోదు చేయాలని సూచించారు.ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఒక్కరితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సిబ్బందికి సీపీ గౌష్ ఆలం సూచించారు.ఈ ఆకస్మిక తనిఖీలో త్రీ టౌన్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ తిరుమల్ గౌడ్తో పాటు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# కరీంనగర్ రూరల్, కొత్తపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్ష పదవులకు ఆశావహుల దరఖాస్తులు

**కరీంనగర్, మన జనప్రగతి ఆగస్టు 31:** కరీంనగర్ రూరల్ మండల కాంగ్రెస్, కొత్తపల్లి మండల కాంగ్రెస్ నూతన అధ్యక్షుల ఎంపిక ప్రక్రియలో భాగంగా ఆశావహుల నుంచి దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం సోమవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జరిగింది.జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, చొప్పదండి ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం ఆదేశాల మేరకు జిల్లా కాంగ్రెస్ కార్యాలయ పీఆర్వో నాత శ్రీనివాస్ ఆశావహుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు.మండల కాంగ్రెస్ అధ్యక్షుల ఎంపికలో భాగంగా సెప్టెంబర్ 1, మంగళవారం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు డా. మేడిపల్లి సత్యం, పీసీసీ పరిశీలకులు కూన శ్రీశైలం గౌడ్, ఖాజా ఫక్రుద్దీన్ దరఖాస్తు చేసుకున్న ఆశావహులతో సమావేశం నిర్వహించనున్నారు. అనంతరం వారి అభిప్రాయాలను పరిశీలించి ఇరువురు మండలాలకు నూతన అధ్యక్షులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.కరీంనగర్ రూరల్ మండలం నుంచి దరఖాస్తులు:బొంగోని గోపాల్, గాండ్ల అంజయ్య, చల్ల మల్లారెడ్డి, మడ్డి రంగయ్య, కూర నరేష్ రెడ్డి, కస్తూరి అశోక్ రెడ్డి.కొత్తపల్లి మండలం నుంచి దరఖాస్తులు:పెంట శేఖర్, పంజాల స్వామి గౌడ్, సిరిపురం నాగప్రసాద్, బోనాల అశోక్ కుమార్, రూపు రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, రాజా గౌడ్, రంగన వేణి రవీందర్.మండల అధ్యక్ష పదవుల కోసం పలువురు నాయకులు దరఖాస్తు చేసుకోవడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో ఆసక్తి నెలకొంది. మంగళవారం జరిగే సమావేశం అనంతరం నూతన మండల అధ్యక్షులపై స్పష్టత రానుంది.



# కూటమిలో కుమ్ములాటలు..కేడర్‌లో కలవరం..!

### రాజంపేట నియోజకవర్గంలో స్థానిక ఎన్నికల వేళ మూడు పార్టీల్లోనూ అంతర్గత విభేదాలు

### టీడీపీలో వర్గపోరు..జనసేనలో నాయకత్వ పోటీ..కార్యకర్తల్లో ఆందోళన

**రాజంపేట మన జనప్రగతి ఆగష్టు 31:–** రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో రాజంపేట నియోజకవర్గంలో కూటమి రాజకీయాలు చర్చనీయాంశంగా మారుతున్నాయి. అధికారంలో ఉన్న కూటమి పార్టీల మధ్య సమన్వయం కొరవడటంతో పాటు, ఆయా పార్టీల్లో అంతర్గత విభేదాలు కార్యకర్తలను అయోమయానికి గురిచేస్తున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. బహిరంగ సభలు, సమావేశాల్లో మూడు పార్టీలు ఐక్యంగా ఉన్నామని నేతలు ప్రకటిస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయని పార్టీ శ్రేణుల్లో చర్చ జరుగుతోంది. రాజంపేట నియోజకవర్గాన్ని వైసీపీ కైవసం చేసుకోవడంతో కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి టీడీపీ కార్యకర్తల్లో ఒకరకమైన అసంతృప్తి నెలకొన్నట్లు తెలుస్తోంది. ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి ఓటమి అనంతరం చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలు కూడా కేడర్‌పై ప్రభావం చూపినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అనంతరం చమర్తి జగన్మోహన్ రాజుకు నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించడంతో పార్టీ శ్రేణుల్లో కొంతమంది అధిష్ఠానం నిర్ణయానికి కట్టుబడి ఆయన నాయకత్వంలో పనిచేస్తుండగా, మరికొందరు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారనే చర్చ ఉంది. ఇక కొందరు నాయకులు తమతమ వర్గాలతో విడివిడిగా కార్యక్రమాలు నిర్వహిస్తుండటంతో నియోజకవర్గంలో టీడీపీ మూడు వర్గాలుగా ఉన్న పరిస్థితి కనిపిస్తోందని కార్యకర్తలు పేర్కొంటున్నారు. అధిష్ఠానం ఆదేశాలను పాటిస్తూ పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ, అధికారంలో ఉన్న కొందరు నాయకులు అధికారం వచ్చిన తరువాత పార్టీలో చేరిన వారికే ప్రాధాన్యత ఇస్తున్నారనే అసంతృప్తి క్షేత్రస్థాయి కార్యకర్తల్లో వ్యక్తమవుతోంది. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి తగిన గుర్తింపు, ప్రాధాన్యత లభించడం లేదని కొందరు టీడీపీ కార్యకర్తలు పలుమార్లు అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లినట్లు చెబుతున్నారు. అయితే సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కారం కాకపోవడంతో కేడర్‌లో నిరుత్సాహం నెలకొందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. స్థానిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఈ విభేదాలకు ముగింపు పలికి అందరినీ సమన్వయం చేసే సమర్థవంతమైన నాయకత్వం అవసరమని టీడీపీ శ్రేణులు కోరుతున్నాయి. కూటమిలో మరో భాగస్వామి అయిన బీజేపీ పరిస్థితి కూడా నియోజకవర్గంలో ఆశించిన స్థాయిలో లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సమావేశాలు, కార్యక్రమాల్లో పార్టీ ఉనికిని చాటుతున్నప్పటికీ గ్రామస్థాయిలో బలమైన కేడర్‌ను నిర్మించడంలో వెనుకబడిందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని మండలాలు, గ్రామాల్లో పార్టీని విస్తరించాల్సిన అవసరం ఉందని ఆ పార్టీ శ్రేణుల్లో చర్చ జరుగుతోంది. నియోజకవర్గంలో బలమైన



సామాజిక వర్గం, పవన్ కల్యాణ్ అభిమానులు జనసేనకు అనుకూలంగా ఉన్నప్పటికీ ఆ బలాన్ని రాజకీయంగా మలచడంలో పార్టీ నాయకత్వం విఫలమవుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. మండల, గ్రామస్థాయిలో పార్టీ విస్తరణకు అవసరమైన కార్యక్రమాలు పెద్దగా కనిపించడం లేదని కొందరు కార్యకర్తలు అంటున్నారు. అదే సమయంలో పార్టీ నాయకత్వం కోసం ఇద్దరు, ముగ్గురు నేతలు పోటీ పడుతున్న పరిస్థితి కూడా కేడర్‌లో అయోమయానికి కారణమవుతోందనే అభిప్రాయాలు ఉన్నాయి. పార్టీ కమిటీలు ఏర్పాటు చేసి బాధ్యతలు అప్పగిస్తే మరింత ఉత్సాహంగా పనిచేస్తామని పలువురు నాయకులు చెబుతున్నట్లు తెలుస్తోంది. మూడు పార్టీల నేతలు బహిరంగ వేదికలపై ఐక్యతను చాటుతున్నప్పటికీ, గ్రామస్థాయిలో మాత్రం సమన్వయం కొరవడుతోందనే విమర్శలు ఉన్నాయి. ముఖ్యంగా ప్రభుత్వ కార్యక్రమాలు, స్థానిక రాజకీయ వ్యవహారాల్లో టీడీపీకి ఎక్కువ ప్రాధాన్యత లభిస్తోందనే భావన జనసేన, బీజేపీ శ్రేణుల్లో ఉందని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు. దీంతో మిగతా పార్టీలకు చెందిన కొందరు నాయకులు, కార్యకర్తలు తమకు పెద్దగా ప్రాధాన్యత లేదన్న భావనతో పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారనే చర్చ సాగుతోంది. ఇప్పటికే గ్రామస్థాయిలో వర్గ విభేదాలు, నాయకత్వ పోటీలు, సమన్వయ లోపాలు కొనసాగుతున్న నేపథ్యంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు రాజంపేట కూటమికి కీలక పరీక్షగా మారనున్నాయి. అభ్యర్థుల ఎంపిక నుంచి ప్రచారం వరకు మూడు పార్టీల మధ్య సమన్వయం అత్యంత కీలకం కానుంది. అంతర్గత విభేదాలను పరిష్కరించి, కేడర్‌ను ఏకతాటిపైకి తీసుకురావడంతో పాటు గ్రామస్థాయిలో పార్టీ యంత్రాంగాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని కూటమి శ్రేణులు అభిప్రాయపడుతున్నాయి. కూటమి నేతల మధ్య సమన్వయం పెరిగి, కార్యకర్తల సమస్యలకు పరిష్కారం లభిస్తేనే స్థానిక ఎన్నికల్లో ఆశించిన ఫలితాలు సాధ్యమవుతాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# వెలిగొండ ప్రాజెక్టుపై కూటమి ప్రభుత్వం క్రెడిట్ చోరీ తగదు

### ఈ ప్రాజెక్టు పూర్తి వెనక అన్ని పార్టీల కృషి ఉంది: మాజీ ఎంపీ నర్రెడ్డి తులసి రెడ్డి

**వేంపల్లె మన జనప్రగతి ఆగస్టు 31:–**మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లా లలో 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు, 23 లక్షల మందికి త్రాగునీరు అందించే వెలిగొండ సాగునీటి ప్రాజెక్టులో మొదటి ఫేజ్ ను సోమవారం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రారంభించడం హర్షనీయమని రాజ్యసభ మాజీ సభ్యుడు , కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి పేర్కొన్నారు. వేంపల్లిలో సోమవారం ఆయన పార్టీ నేతలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణంలో అన్ని పార్టీల కృషి,భాగస్వామ్యం ఉందని,అందులో సింహభాగం పనులు కాంగ్రెస్ హయాంలో జరిగాయన్నారు. కాంగ్రెస్ హయాంలో ఈ ప్రాజెక్టుకు పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు అని నామకరణం చేయడం జరిగిందన్నారు. 1985లో ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఈ ప్రాజెక్టుకు రూపకల్పన జరిగిందని,1996 మార్చి 5వ తేదీన ఆనాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ ప్రాజెక్టుకు గొట్టిపడియ వద్ద తొలిసారిగా శంకుస్థాపన చేశారన్నారు. ఈ ప్రాజెక్టుకు ఎన్టీఆర్ శంకుస్థాపన చేశారే తప్ప 2004 వరకు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే టంత వరకు ఆ ఎనిమిది సంవత్సరాల కాలంలో ఈ ప్రాజెక్టుపై పైసా ఖర్చు పెట్టలేదు,తట్టెడు మట్టి



పోయలేదు,తీయలేదన్నారు . 2004లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత 2004 అక్టోబర్ 27న ఆనాటి కాంగ్రెస్ ముఖ్యమంత్రి స్వర్గీయ రాజశేఖర్ రెడ్డి ఈ ప్రాజెక్టుకు మళ్ళీ శంకుస్థాపన చేసి ఈ ప్రాజెక్టును జలయజ్ఞం కింద చేర్చడం జరిగిందన్నారు. 2004 – 2014 మధ్య కాంగ్రెస్ పాలనలో సింహభాగం పనులు జరిగాయన్నారు.ఈ ప్రాజెక్టులో ప్రధాన భాగం రెండు భారీ సొరంగాలు నిర్మించారని ఒక్కొక్క సొరంగం పొడవు 18.82 కిలోమీటర్లు,రెండు సమాంతర సొరంగాల పొడవు 37.64 కిలోమీటర్లు ఇందులో 20.333 కిలోమీటర్ల సొరంగం పనులు కాంగ్రెస్ హయాంలో జరిగాయన్నారు. ఇందులో 6.686 కిలోమీటర్ల పొడవు మేరకు పనులు తెలుగుదేశం పార్టీ హయాంలో జరిగాయని,10. 568 కిలోమీటర్ల పొడవు గల పనులు వైకాపా పాలనలో జరిగాయన్నారు . దీన్ని బట్టి చూస్తే వెలుగొండ ప్రాజెక్టు నిర్మాణంలో కమ్యూనిస్టుల, కాంగ్రెస్, వైకాపా, టిడిపిల పార్టీల కృషి ఉన్నదని స్పష్టంగా అర్థం అవుతుంది.సొమ్మొకడిది – సోకొకడిది అన్నట్లు కాంగ్రెస్ పార్టీ,మిగతా పార్టీలు చేసిన కృషిని గుర్తించకుండా మొత్తం ప్రాజెక్టు పనులన్నీ తమ హయాంలోనే జరిగినట్లు టిడిపి నాయకులు గొప్పలు చెప్పుకోవడం సమంజసం కాదన్నారు ఏది ఏమైనప్పటికీ మూడు దశాబ్దాల స్వప్నం సాకారం కావడం హర్షనీయమన్నారు .ప్రస్తుతం తొలి ఫేస్ పనులు మాత్రమే పూర్తయ్యాయని, తొలి ఫేజ్ లో పది టీఎంసీలతో 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు,నాలుగు లక్షల మందికి త్రాగునీరు మాత్రమే అందగలదని ఆయన పేర్కొన్నారు. రెండవ ఫేజ్ పనులు కూడా పూర్తి చేస్తేనే ప్రాజెక్టు లక్ష్యాలు నెరవేరుతాయన్నారు.అదే సమయంలో ప్రాజెక్టు కోసం త్యాగం చేసిన 11 గ్రామాల నిర్వాసితుల యొక్క సమస్యలు ఇంకా పూర్తిస్థాయిలో పరిష్కారం కాలేదని, ఏమాత్రం ఆలస్యం చేయకుండా నిర్వాసితుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని,రెండో పేజ్ పనులు కూడా త్వరగా పూర్తి చేయాలన్నారు. మీడియా సమావేశంలో కిసాన్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగం రామకృష్ణారెడ్డి,జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు డాక్టర్ సుబ్రహ్మణ్యం, పులివెందుల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త ధ్రువ కుమార్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్ రెడ్డి ఉత్తన్న పాల్గొన్నారు.

# ద్వారంపూడి నైజం ప్రజల కోసమే పనిచేయడం

### • నాలుగేళ్ల నాటి ఫొటోతో దుష్ప్రచారం హేయం..ప్రభుత్వమే సమాధానం చెప్పాలి: ఇంజనీర్ పిల్లి రామారావు



**కాకినాడ మన జనప్రగతి ఆగస్టు 31:–**అధికారం ఉన్నా.. లేకున్నా ప్రజల కోసం పనిచేయడమే కాకినాడ సిటీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి నైజమని కాకినాడ జిల్లా ఉద్యోగ, పెన్షనర్ విభాగం రాష్ట్ర కార్యదర్శి ఇంజనీర్ పిల్లి రామారావు అన్నారు. పిఠాపురం పంచాయతీరాజ్ అసిస్టెంట్ ఇంజనీర్ కుటుంబం ఆత్మహత్య కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న సాదిక్‌ఖాన్‌తో ద్వారంపూడికి సంబంధాలు ఉన్నాయంటూ నాలుగేళ్ల నాటి ఫొటోను ఆధారంగా చేసుకుని చేస్తున్న దుష్ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు.ద్వారంపూడిని అప్రతిష్ఠపాలు చేయాలని కొందరు చేస్తున్న ప్రయత్నాలు "ఆకాశంపై ఉమ్మి వేయడమే" అని రామారావు వ్యాఖ్యానించారు. ప్రజల్లో ద్వారంపూడికి ఉన్న ఆదరణ, రాజకీయంగా ఆయనకున్న ప్రజా సంబంధాలను దెబ్బతీయడానికి అసత్య ప్రచారాలు చేసినంత మాత్రాన ఆయన ప్రతిష్ఠకు ఎలాంటి నష్టం జరగదన్నారు. ఇలాంటి ప్రచారాలు చేసేవారి ఉద్దేశాలను ప్రజలే అర్థం చేసుకుంటారని పేర్కొన్నారు.ప్రజాప్రతినిధిగా ఉన్న సమయంలో వివిధ వర్గాలు, సంస్థలు నిర్వహించే కార్యక్రమాలకు ఆహ్వానం అందినప్పుడు హాజరు కావడాన్ని ద్వారంపూడి తన బాధ్యతగా భావించేవారని రామారావు తెలిపారు. ఒక కార్యక్రమంలో తీసుకున్న పాత ఫొటోను ఇప్పుడు వేరే కోణంలో ప్రచారం చేయడం సరికాదన్నారు.అదే సమయంలో ఎన్నికల సమయంలో ఇచ్చిన నిరుద్యోగ భృతి హామీ ఏమైందని, స్పోర్ట్స్ కోటాలో వెలుగుచూస్తున్న నకిలీ ధ్రువపత్రాల వ్యవహారంపై ప్రభుత్వం స్పష్టమైన సమాధానం చెప్పాలని ఇంజనీర్ పిల్లి రామారావు డిమాండ్ చేశారు.

# దర్గా హోన్నూరులో మహర్షి వాల్మీకి విగ్రహా ప్రతిష్ఠాపన

**బొమ్మనహాల్ మన జనప్రగతి ఆగస్టు 31:–** మండల పరిధిలోని దర్గా హోన్నూరు గ్రామంలో మహర్షి వాల్మీకి విగ్రహా ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే,ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు చేతుల మీదుగా ఘనంగా నిర్వహించారు,గ్రామంలో వేకువజాము నుంచే హోమాలు, యాగాలు నిర్వహించి మహర్షి వాల్మీకి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు,అనంతరం యువకులు డీజే పాటలతో గ్రామంలో విగ్రహాన్ని ఊరేగించడంతో గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నసత్రం ఏర్పాటు చేసి అన్నప్రసాదం అందించారు, ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ..ప్రతి గ్రామంలో మహర్షి వాల్మీకి విగ్రహాలను ప్రతిష్ఠించుకోవడం ఆనవాయితీగా కొనసాగుతోందన్నారు,మహర్షి వాల్మీకి ఆశయాలు,ఆయన చూపిన మార్గాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు,గ్రామస్తుల ఐక్యత, భక్తిశ్రద్ధలతో కార్యక్రమాన్ని విజయవంతం చేయడం అభినందనీయమన్నారు,ఈ కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు కొత్తపల్లి తిమ్మరాజు కొత్తపల్లి మల్లికార్జున,ఎంపీపీ ముల్లంగి నాగమణి, నారాయణస్వామి,మండల కన్వీనర్ కె.మల్లన్న మాజి మార్కెట్ యార్డ్ డైరెక్టర్ కె.మహేంద్ర,మాజీ మండల కన్వీనర్ బలరాం రెడ్డి,జగన్నాథ రెడ్డి,మాజీ సర్పంచ్ కేసప్ప, నాయకులు కేపీ. వన్నూరుస్వామి,ఎస్.జి. వన్నూరుస్వామి,సుంకన్న,దివాకర్,రామస్వామి,ముక్కన్న,ఖాసిం వలి,చెన్నప్పతో పాటు వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో వాల్మీకి సోదరులు పాల్గొన్నారు.



# ఆడబిడ్డ నిధి ఏమైంది..?

### రెండున్నర ఏళ్లుగా మహిళలను మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వం

### మహిళలకు ఇచ్చిన హామీని నెరవేర్చే చిత్తశుద్ధి ప్రభుత్వానికి ఉందా..?

### జమ్మలమడక నాగమణి సూటి ప్రశ్న

**కాకినాడ మన జనప్రగతి ఆగస్ట్ 31:–**ఎన్నికల సమయంలో మహిళలకు నెలకు రూ.1,500 చొప్పున 'ఆడబిడ్డ నిధి' అందిస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు రెండున్నరేళ్లు పూర్తవుతున్నా ఈ పథకాన్ని ఎందుకు అమలు చేయలేదని వైసీపీ రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి ప్రశ్నించారు. ఎన్నికల ముందు సాధ్యం కాని హామీలతో మహిళలను నమ్మించి ఓట్లు వేయించుకున్న కూటమి నాయకులు ఇప్పుడు ఆ హామీలను నెరవేర్చలేక తలలు పట్టుకుని కూర్చుని మహిళలకు ముఖం చాటేస్తున్నారని ఆమె




విమర్శించారు మహిళలను మోసం చేసిన వారికి మనుగడ ఉండదని ఆమె హెచ్చరించారు.ఎన్నికల ముందు మహిళలకు ఇచ్చిన హామీని నమ్మి ఓట్లు వేసిన మహిళలకు ఇప్పుడు నిరాశే మిగిలిందని రెండున్నరేళ్లు ్లగా ఆడబిడ్డ నిధి అందకపోవడంతో ప్రతి అర్హత కలిగిన మహిళ నెలకు రూ.1,500 చొప్పున, ఇప్పటివరకు సుమారు రూ.45,000 వరకు ప్రయోజనం కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు.ప్రభుత్వం ఇతర పథకాల గురించి గొప్పగా ప్రచారం చేసుకుంటున్నప్పటికీ, మహిళలకు ఇచ్చిన ఈ కీలక హామీని మాత్రం ఎందుకు పక్కన పెట్టిందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని మరిచిపోవడం ప్రజలను మోసం చేయడమే అని అన్నారు.మహిళల ఆర్థిక భద్రత కోసం ప్రకటించిన ఆడబిడ్డ నిధిని తక్షణమే అమలు చేయడంతో పాటు, ఇప్పటివరకు నష్టపోయిన మొత్తాన్ని కూడా అర్హులైన మహిళలకు చెల్లించాలని డిమాండ్ చేశారు.

PRINTER, PUBLISHER AND OWNED BY **YADATI VIVEKANANDA REDDY YADAV**, AND PRINTED AT M/S GOKUL PUBLICATIONS, # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), PUBLISHED AT # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), Editor : YADATI VIVEKANANDA REDDY YADAV, E-Mail :manajanapragathi@gmail.com, Cell : 8125555507 RNI No : - APTEL/2021/80174